

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

RNI-APTEL/2012/46499

GST No.37ACDFM5465G1Z1

మంచుకురిసే వేళలో..



సంపుటి : 14 | సంచిక : 21 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : మహేష్ యాదవ్ | 18-01-2026 | పేజీలు :12 | వెల :03/-


# హైడ్రోజన్ వ్యాలీగా ఏపీ

- అన్ని రాష్ట్రాలకూ వచ్చిన పెట్టుబడుల్లో 25శాతం మనకే..
- యూనిట్ విద్యుత్ కొనుగోలు ఖర్చు 1.19కి తగ్గిస్తాం
- ఈ ఏడాదే డ్రోన్ అంబులెన్స్ సేవలు అందుబాటులోకి
- సంపద సృష్టికి ఏపీని మించిన రాష్ట్రం లేదు
- కాకినాడలో 'గ్రీన్ అమ్మోనియా' ప్లాంట్‌లో
- భారీ యంత్రాలను ప్రారంభించిన చంద్రబాబు, పవన్

పల్లె వెలుగు

'సన్‌రైజ్ ఏపీ'లో భాగంగా సోలార్ ఎనర్జీకి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. అలాగే పంప్డ్ స్టోరేజ్, విండ్ పవర్‌కు రాష్ట్రం అనుకూలం. ఈ మూడూ గ్రీన్ అమ్మోనియం తయారీకి అనుకూలంగా ఉంటాయి. అలాగే దేశంలో మొదటి క్వాంటమ్ కంప్యూటర్ అమరావతిలో రాబోతోంది.

– సీఎం చంద్రబాబు




కాకినాడ, జనవరి 17 రాబోయే రోజుల్లో రాష్ట్రం హైడ్రోజన్ వ్యాలీగా మారుతుందని సీఎం చంద్రబాబు తెలిపారు. సౌర, పవన, జలవిద్యుత్, పంప్డ్ స్టోరేజ్‌లాంటి విద్యుదుత్పత్తికి, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియాఎంతో అనుకూలంగా మారిందన్నారు. గ్రీన్ ఇంధనం)పై చర్చ వస్తే ప్రపంచవ్యాప్తంగా త్వరలో కాకినాడ పేరు వినిపించనుందని తెలిపారు. కాకినాడలో 'ఏఎం గ్రీన్' కంపెనీ నిర్మిస్తున్న గ్రీన్ అమ్మోనియా ప్లాంట్‌లో భారీ యంత్రాల ఏర్పాటును సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు శనివారం బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ ప్రాజెక్టును మొత్తం మూడు దశల్లో అభివృద్ధి చేయనున్నారు. తొలిదశలో వచ్చే ఏడాదికి 5 లక్షల టన్నులు, 2028 నాటికి పది లక్షల టన్నులు.. మూడో దశకు వచ్చేసరికి పూర్తిస్థాయి సామర్థ్యం 15 లక్షల టన్నుల గ్రీన్ అమ్మోనియాను ఉత్పత్తి చేయనున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు.

# నాకు శత్రువుల్లేరు

- –ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- –నిరక్షరాస్యత, పేదరికం, కరువే నా శత్రువులు
- –ఉన్న ఒక్క శత్రువునూ ఎన్నికల్లో ఓడించాను
- –మారీచుడు ఏ రూపంలో వచ్చినా కట్టిపడేస్తాం
- –జైపాల్‌రెడ్డి, జానారెడ్డి సమయంలో చెల్లినట్లు ఇప్పుడు చెల్లదు.. దెబ్బకు దెబ్బ తీస్తాం
- –పంచడానికి భూముల్లేవు.. విద్యను మాత్రమే పంచగలుగుతాం: పాలమూరు సభలో సీఎం
- –1,463 కోట్లతో ట్రిపుల్ ఐటీ క్యాంపస్ సహా వివిధ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన

మహబూబ్‌నగర్/జడ్చర్ల, జనవరి 17పల్లె వెలుగు




తనకు శత్రువులంటూ ఎవరూ లేరని, సమాజంలోని నిరక్షరాస్యత, పేదరికం, కరువే తన శత్రువులు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శత్రువు అనుకునే ఒక్క వ్యక్తినీ 2023లోనే ఓడించానని తెలిపారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి.. ట్రిపుల్ ఐటీ సహా రూ.1,463 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంవీఎస్ కాలేజీ మైదానంలో నిర్వహించిన ప్రజాపాలన–ప్రగతి బాట బహిరంగ సభలో మాట్లాడారు. "రాజకీయ ప్రత్యర్థులు ఉంటే ఎన్నికల్లో ఓడించినం. 2024లో పార్లమెంట్‌లో గుండు సున్నా ఇప్పించిన. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్‌లో వాళ్ల ఎమ్మెల్యేలు చనిపోతే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించుకున్న. సర్పంచ్ ఎన్నికల్లో 66 శాతం గెలిపించుకున్న. నా శత్రువులు అక్షరాస్యత లేకపోవడం, పేదరికం, మహిళలకు అన్యాయం. విద్యార్థులకు నష్టం చేసేటోళ్లు, చదువుకోకుండా ఊరిమీద తిరిగేటోళ్లు నా శత్రువులు" అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాలమూరు బిడ్డకు వ్యూహం తెలుసునని, ఎత్తుగడ, దెబ్బకు దెబ్బతీయడమూ తెలుసునని అన్నారు.

# సాయిరెడ్డికి ఈడీ సమన్లు

- వేల కోట్ల లిక్కర్ స్కామ్‌లో వైసీపీ మాజీ ఎంపీకి పిలుపు
- 22న విచారణకు రావాలంటూ నోటీసు జారీ
- ఇప్పటికే విచారించిన సిట్ అధికారులు
- స్కామ్ సంగతులు తెలిపిన సాయిరెడ్డి
- రాజ్ కసిరెడ్డే కీలకమని నాడు వెల్లడి
- ముడుపులను దేశం దాటించారన్న సాయిరెడ్డి
- విజిల్ బ్లోయర్ అవుతానంటూ అభ్యర్థన

అమరావతి, జనవరి 17



వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భారీ లిక్కర్ స్కామ్‌లో ఆ పార్టీ మాజీ కీలక నేత విజయసాయి రెడ్డికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సమన్లు జారీ చేసింది. ఈ నెల 22వ తేదీన హైదరాబాద్ ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని తెలిపింది. మద్యం వ్యాపారుల నుంచి భారీ స్థాయిలో కమీషన్లు, ఆ సొమ్ము అక్రమ మార్గంలో విదేశాలకు మళ్లింపు వెనకున్న వాస్తవాన్ని వెలికి తీసేందుకు ఈడీ నడుం బిగించింది. అందులో భాగంగా విజయవాడ జైల్లో ఉన్న ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డిని గతంలో ప్రశ్నించిన ఈడీ.. డిస్టిలరీస్ యజమానులు, మధ్యవర్తులను సైతం విచారించింది. ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌బీసీఎల్) మద్యం సరఫరాదారులకు చేసిన చెల్లింపుల నుంచి వైసీపీ లిక్కర్ మాఫియా పలు మార్గాల్లో కమీషన్ వసూలు చేసింది.

# ఆర్టీసీకి జాతీయస్థాయి అవార్డు గర్వకారణం

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి, జనవరి 17 పల్లె వెలుగు



ఏపీఎస్ ఆర్టీసీకి జాతీయస్థాయిలో ప్రతిష్ఠాత్మక 'గవర్నెన్స్ నౌ– ఆరో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సమ్మిట్' అవార్డు రావడం గర్వకారణమని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ఆర్టీసీ అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది ప్రజలకు అంకిత భావంతో సేవలు అందిస్తున్నారు. ప్రయాణికులకు ముందస్తు సమాచారం అందించడంతో సేవలో నాణ్యత మరింత మెరుగుపడింది. డిజిటల్ సాంకేతికతను ప్రజాసేవకు వినియోగించిన ఆర్టీసీ కృషికి జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ప్రధాన బస్టాపుల్లో ఆటో మేటిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్ (ఏఏఎస్) అమలు ప్రశంసనీయం. సాంకేతికతను అందిపుచ్చుకుని, సీఎం చంద్రబాబు విజన్‌కు అనుగుణంగా ఆర్టీసీ ముందడుగు వేస్తోంది. రాబోయే రోజుల్లో ప్రయాణికులకు మరింత ఆధునిక, సౌకర్యవంతమైన సేవలు అందిస్తాం. ప్రజా రవాణా రంగంలో మహిళలకు ఉచిత బస్సు, పండుగ వేళల్లో సాధారణ చార్జీలు ఉంచుతూ ఏపీఎస్ఆర్టీసీని దేశానికి ఆదర్శంగా నిలబెడతాం. అవార్డు సాధనలో కీలక పాత్ర పోషించిన ఆర్టీసీ ఎండీ ద్వరకా తిరుమలరావుకు అభినందనలు' అని మంత్రి పేర్కొన్నారు.

# నవ మేడారం!

(వరంగల్, ప్రతినిధి) పల్లె వెలుగు



అక్కడే మంత్రివర్గ భేటీ.. రాత్రికి బస. రేపు ఉదయం 7 గంటలకు గద్దెల ప్రాంగణాన్ని ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డిమేడారం మెరిసిపోతోంది.. సమ్మక్క–సారలమ్మ వనదేవతల గద్దెల ప్రాంగణం తళుక్కుమంటోంది.. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా గ్రానైట్ స్తంభాలపై చెక్కిన చిహ్నాలు, కూడళ్లలో ఆదివాసీల జీవన చిత్రాల అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. భవిష్యత్తు తరాలకు మేడారం చరిత్ర, ఆదివాసీల జీవన విధానాన్ని చాటిచెప్పేలా రూ.101 కోట్లతో ప్రభుత్వం చేపట్టిన గద్దెల ప్రాంగణం పునర్నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ నెల 28వ తేదీ నుంచి 31 వరకు మహా జాతర జరగనుంది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా గద్దెల ప్రాంగణం పునఃప్రారంభం జరగనుంది. ఆదివారం సాయంత్రమే మేడారానికి చేరుకోనున్న సీఎం.. రాష్ట్ర మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించి, రాత్రికి అక్కడే బస చేయనున్నారు. సీఎం, మంత్రుల పర్యటన, సమావేశం కోసం అధికార యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది.

# కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినాన్ని రాష్ట్ర పండుగగా జరుపుకొందాం

దూండీ రాకేశ్

అమరావతి, జనవరి 17 పల్లె వెలుగు



'కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించి కూటమి ప్రభుత్వం ఆర్యవైశ్యుల పట్ల తన చిత్తశుద్ధిని చాటుకుంది. ఈ నెల 20న రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో అమ్మవారి ఆత్మార్పణ దినాన్ని రాష్ట్ర పండుగగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం' అని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండీ రాకేశ్ పేర్కొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే సీఎం చంద్రబాబు తూర్పుగోదావరి జిల్లా పెనుగొండలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

# జీసీసీ హబ్‌గా విశాఖ

మార్చి నుంచి 'ఇసాయ్ ఫార్మా' కార్యకలాపాలు!

(విశాఖపట్నం–పల్లె వెలుగు




విశాఖపట్నాన్ని గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల (జీసీసీ) హబ్‌గా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం సాకారమవుతోంది. జపాన్‌కు చెందిన అతిపెద్ద ఫార్మా కంపెనీ 'ఇసాయ్' విశాఖలో తొలి జీసీసీని మార్చిలో ప్రారంభించనుంది. ఈ సంస్థ ఇప్పటికే విశాఖకు 35 కిలోమీటర్ల దూరంలోని పరవాడ రాంకీ ఫార్మా సిటీలో 2009 నుంచి మందులు తయారు చేసి విదేశాలకు ఎగుమతి చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం జీసీసీ పాలసీ ప్రకటించగానే తామూ సంస్థ ఏర్పాటు చేస్తామని ముందుకువచ్చింది.

పల్లె వెలుగు
అవినీతిపై నిఘా
GST No.37ACDFM5465G1Z1 RNI-APTEL/2012/46499
ఆదివారం 18-01-2026

# కల్వల మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



**కేసముద్రం, జనవరి 17 పల్లె వెలుగు**

కేసముద్రం మండలంలోని కల్వల మోడల్ స్కూల్లో 6 నుండి 10వ తరగతి వరకు ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ పరిమి నవీన్ ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లు, 7 నుంచి 10 తరగతి వరకు మిగిలిన సీట్లకు ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, పిహెచ్సీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.125, ఓసి విద్యార్థులు రూ.200 చెల్లించి ఆన్ లైన్ లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 6వ, తరగతి విద్యార్థులకు ఏప్రిల్ 19 ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7 నుండి 10 తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

# ముగ్గుల పోటీల బహుమతుల ప్రధానం చేసిన కనుమ గ్యాంగ్



**కేసముద్రం, జనవరి 17 పల్లె వెలుగు**

కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని కేసముద్రం విలేజ్ లో శుక్రవారం సాయంత్రం శ్రీవివేకవర్ధిని పాఠశాల ఆవరణంలో కనుమ గ్యాంగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానోత్సవం చేశారు. కనుమ గ్యాంగ్ 4వ వార్షికోత్సవం సందర్భంగా రెండవ సారి ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కాటం సుజిత్ రెడ్డి మొదటి 10 బహుమతులకు పట్టు చీరలు, కనుమ గ్యాంగ్ సభ్యులు కన్సోలేషన్ చీరలను అందజేశారు. ఈ సందర్భంగా సుజిత్ రెడ్డి మాట్లాడుతూ తన సోదరి శ్వేత, తండ్రి యాకుబ్ రెడ్డి జ్ఞాపకార్థంగా కనుమ గ్యాంగ్ ఆధ్వర్యంలో చీరలు బహుమానంగా ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని, ముఖ్యంగా గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున ముగ్గుల పోటీలో పాల్గొని ఆకర్షణీయమైన ముగ్గులు ఎంతో శ్రద్ధతో వేశారని, గతేడాది కన్నా ఈసారి ముగ్గులు ఆకర్షణీయంగా ఉన్నాయని, అన్ని ముగ్గులు కూడా బాగా వేశారన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. కనుమ గ్యాంగ్ అధ్యక్షుడు సంకపల్లి శ్రీకాంత్ రెడ్డి, సభ్యులు మాసాడి అశోక్, సీతారాం రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మహేందర్ రెడ్డి, సుధీర్, అనిల్ రెడ్డి, జలంధర్ రెడ్డి, రమేష్ రెడ్డి, సంతోష్ రెడ్డి, భరత్ రెడ్డి, కార్తీక్ రెడ్డి, నవీన్ రెడ్డి, లక్ష్మీ కాంత్ రెడ్డి, ఉమేష్ రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.?

# ఎస్టి మహిళకే కేసముద్రం మున్సిపల్ చైర్మన్ గిరి.

**కేసముద్రం, జనవరి 17(నంది పత్రిక):**



కేసముద్రం మున్సిపల్ చైర్మన్ గిరి ఎస్టీ మహిళలకు దక్కనుంది. శనివారం అధికారులు ప్రకటించిన రిజర్వేషన్లలో కేసముద్రం మునిసిపల్ చైర్ పర్సన్ గా ఎస్టీ మహిళకు కేటాయించారు. నూతనంగా ఏర్పడిన కేసముద్రం మున్సిపాలిటీలోని 16 వార్డులకు అధికారులు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ మొత్తం 16 వార్డులలో 8 వార్డులు మహిళలకు కేటాయించారు. దీంతో కొత్తగా ఏర్పడిన కేసముద్రం మున్సిపల్ తొలి చైర్ పర్సన్ గా ఎస్టీ మహిళ బాధ్యతలు చేపట్టనుంది. అధికారులు ఖరారు చేసిన రిజర్వేషన్ల ప్రకారం 2, 3వ వార్డులు ఎస్టీ జనరల్, 15వ వార్డు ఎస్టీ మహిళ, 4వ వార్డు ఎస్సీ జనరల్ కాగా 8వ వార్డు ఎస్సీ మహిళ, 6, 12వ వార్డులు బిసి జనరల్, 10వ వార్డు బిసి మహిళ, 1, 5, 9, 13, 16వ వార్డులు జనరల్ మహిళ, 7, 11, 14వ వార్డులు జనరల్ గా నిర్ణయించారు. ఇన్ని రోజులుగా ఎదురు చూస్తున్న ఆశావాహుల నిరీక్షణకు అధికారులు తెరదించారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో అమీతుమీ తేల్చుకోవడానికి ఆశావహ అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

# ఐక్యత దినోత్సవ నిరసన బహిరంగ సభను జయప్రదం చేయాలి

**కేసముద్రం, జనవరి 17 పల్లె వెలుగు:**

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక విధానాలను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జరిగే ఆందోళనలో భాగంగా జనవరి 19 ఐక్యత దినోత్సవ సందర్భంగా జిల్లా కేంద్రంలో జరిగే నిరసన ప్రదర్శన బహిరంగ సభలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు, ప్రజాస్వామిక వాదులు భాగస్వాములై వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం కేసముద్రం, మండలంలో సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం మహబూబాబాద్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన జీపుజాతలో తాళ్లపూసపల్లి, కల్వల, కేసముద్రం మున్సిపాలిటీ గ్రామాలలో సిఐటియు జిల్లా కార్యదర్శి సమ్మెట రాజమౌళి, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గునిగంటి రాజన్న, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్యలు మాట్లాడారు. 4లేబర్ కోడ్స్, విబిజి రాంజీ చట్టం, జాతీయ విత్తన, విద్యుత్ సవరణ బిల్లుల రద్దు, కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, వ్యవసాయ కూలీ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ 11 సంవత్సరాల పాలనలో ప్రజల హక్కులను కాలరాయడమే కాక, రాష్ట్రాల హక్కులను హరిస్తూ చట్టాలను చేసిందని, కార్పొరేట్ సంస్థలకు 16 లక్షల కోట్లు రాయతీలు ఇచ్చి, ప్రభుత్వ రంగ సంస్థలను ఆదానీ, అంబానీ వంటి పెట్టుబడిదారులకు కట్టబెట్టిందన్నారు. ఎల్ఐసి రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతిస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలన్నీ కార్పొరేట్లకు అమ్ముతున్నారు. 29 కార్మిక చట్టాలు రద్దుచేసి నాలుగు లేబర్ కోడులుగా తీసుకొచ్చారు. రాష్ట్రాల పరిధిలో ఉన్న విద్యుత్ పంపిణీ, విత్తన దిగుమతి చట్టం 1966 స్థానంలో తీసుకువచ్చిన నూతన విద్యుత్ సవరణ చట్టం, విత్తన బిల్లు, అణురంగంలోకి ప్రైవేట్ కంపెనీలకు అనుమతిస్తూ చట్టం చేసింది. విద్యుత్ సవరణ చట్టం విత్తన బిల్లు రాష్ట్రాల పరిధిలో నుండి కేంద్రం పరిధిలోకి వచ్చేలా చట్టం చేసిందని, కేంద్రం 90 శాతం నిధులు ఇచ్చే ఉపాధి హామీ చట్టం రద్దుచేసి, విబిజి రాంజీ పేరుతో 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్రాలు నిధులు కేటాయించాలన్న చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నల్లపు సుధాకర్, జిల్లా సహాయ



కార్యదర్శి మార్తినేని పాపారావు, సిఐటియు కేసముద్రం మండల కన్వీనర్ జల్లే జయరాజ్, రైతు సంఘం మండల అధ్యక్షులు నీరుటి జలంధర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గోడిశాల వెంకన్న, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తాడబోయిన శ్రీశైలం, సిఐటియు సీనియర్ నాయకులు మోడెం వెంకటేశ్వర్లు, చాగంటి కిషన్, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కావటి నర్సయ్య, సోమారపు ఎల్లయ్య, పోతరబోయిన ఉప్పలయ్య, ఎస్ కే అమీర్, మాద శ్రీనివాస్, తులసిమొగ్గ శేఖర్, తులసిమొగ్గ బిక్షపతి, మయ్య మహేందర్, జాన్పాటి జ్యోతి, మండల నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సమ్మక్క సారలమ్మ జాతర ప్రాశస్త్యం

**హైదరాబాద్, జనవరి 17 పల్లె వెలుగు**

తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లాలో జరిగే అతిపెద్ద, విశిష్ట ఆదివాసీల జాతర మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ప్రతి రెండు సంవత్సరాల కొకసారి జరుగుతుంది. ఈ సంవత్సరం జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు జరుగుతోంది. తెలంగాణ రాష్ట్రం నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, చత్తీస్ గఢ్, జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల నుంచి సుమారు కోటిన్నరకు పైగా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఇది ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతరగా పేరొందింది. అందుబాటులో ఉన్న సమాచారం అనుసరించి ఈ జాతర యొక్క ప్రాశస్త్యమేమనగా 12వ శతాబ్దంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జగిత్యాల ప్రాంతంలోని పొలవాసను పాలించే ఆదివాసి దొర మేడరాజు ఏకైక కుమార్తె సమ్మక్కను, ఆయన మేనల్లుడైన మేడారం పాలకుడు పగిడిద్దరాజుకిచ్చి వివాహం చేశారు. ఈ దంపతులకు సారలమ్మ, జంపన్న ఇద్దరు సంతానం. కాకతీయులకు ప్రతీ సంవత్సరం చెల్లించే కప్పం కట్టలేదన్న కారణంతో కాకతీయ ప్రభువు మొదటి ప్రతాపరుద్రుడు పొలవాసపై దండెత్తుతాడు. ఆయన దాడికి తట్టుకోలేక మేడరాజు మేడారం పోయి అజ్ఞాత వాసం గడుపుతుంటాడు. మేడారాన్ని పాలించే పగిడిద్దరాజు కాకతీయుల సామంతునిగా వుంటూ కరువు కాటకాల కారణంగా కప్పం కట్టలేక పోతాడు. కప్పం కట్టకపోవడం, మేడరాజుకు ఆశ్రయం కల్పించడం, కోయ ఆదివాసిల సార్వభౌమునికి వ్యతిరేకంగా తిరుగుబాటు భావాజాలాన్ని నూరిపోసి రాజ్యాధికారాన్ని ధిక్కరిస్తున్నాడనే కారణాలతో పగిడిద్దరాజుపై ఆగ్రహం చెందిన ప్రతాపరుద్రుడు అతడిని అణచివేయడానికి తన ప్రధానమంత్రి యుగంధరుడితో మాఘ శుద్ధ పౌర్ణమి రోజున మేడారంపై దండెత్తుతాడు. సాంప్రదాయ ఆయుధాలు ధరించి పోరాడిన పగిడిద్దరాజు, సమ్మక్క, సారక్క, జంపన్న, గోవిందరాజులు వీరోచితంగా పోరాటం చేసినప్పటికీ సుశిక్షుతులైన అపార కాకతీయ సేనల ధాటికి తట్టుకోలేక పగిడిద్దరాజు, సారలమ్మ, నాగులమ్మ, గోవిందరాజులు యుద్ధంలో మరణిస్తారు. పరాజయ వార్త విన్న జంపన్న అవమానాన్ని తట్టుకోలేక సంపెంగ వాగులో దూకి ఆత్యహత్యకు పాల్పడతాడు. అప్పటి నుంచి సంపెంగవాగు జంపన్న వాగుగా ప్రసిద్ధి చెందింది. ఇక సమ్మక్క యుద్ధ భూమిలో కాకలు తీరిన కాకతీయుల సైన్యాన్ని ముప్ప తిప్పలు పెడుతుంది. ఆదివాసి మహిళ యుద్ధ నైపుణ్యానికి ప్రతాపరుద్రుడు ఆశ్చర్యచకితుడవుతాడు. చివరికి సమ్మక్కను కాకతీయుల సైన్యం వెనుక వైపు నుండి బరిసెతో పొడుస్తారు. శత్రువుల చేతిలో దెబ్బతిన్న సమ్మక్క రక్తపు ధారలతోనే యుద్ధ భూమి నుంచి నిష్క్రమించి చిలుకల గుట్టవైపు వెళుతూ మార్గమధ్యములోనే అదృశ్యమవుతుంది. సమ్మక్కను వెతుక్కుంటూ వెళ్ళిన అనుచరులకు ఆమె జాడ కనిపించలేదు. కానీ ఆ ప్రాంతంలో ఒక పుట్ట దగ్గర పసుపు, కుంకుమలు గల కుంకుమ భరిణ లభిస్తుంది. దాన్ని సమ్మక్కగా భావించి అప్పటి నుంచి ప్రతి రెండేళ్లకు ఒకసారి మాఘ శుద్ధ పౌర్ణమి రోజున సమ్మక్క-సారలమ్మ జాతరను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఈసారి 2026 లో జనవరి 28 నుండి 31 వ తేదీ వరకు మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర జరుగుతుంది. జాతర మొదటి రోజైన 2026 జనవరి 28 నాడు కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దెకు తీసుకు వస్తారు. అదే రోజు కొండాయి నుండి గోవిందరాజులును, పూనుగుండ్ల నుండి పడిగిద్దరాజులను గద్దెలపై ప్రతిష్ఠింపచేస్తారు. రెండవ రోజు జనవరి 29 సమ్మక్కను చిలుకల గుట్ట నుండి పూజార్లు తీసుకోని వచ్చి గద్దెపై ప్రతిష్ఠింప చేస్తారు. మూడో రోజున శుక్రవారం పూర్తి మొక్కుల చెల్లింపు, నాలుగవ రోజు సాయంత్రం దేవ దేవతలను తిరిగి వన ప్రవేశం చేస్తారు. వంశపారంపర్యంగా వస్తున్న ఆదివాసులే పూజార్లు కావడం, ఈ జాతర పూర్తిగా ఆదివాసీ సాంప్రదాయాల ప్రకారం నిర్వహించడం ప్రత్యేకత. తమ కోర్కెలు తీర్చమని భక్తులు అమ్మవార్లకు బంగారం (బెల్లము) నైవేద్యంగా సమర్పించుకుంటారు.

# 5 రాష్ట్రాల ఎన్నికల పోటీలో 'సమానత' ఏదీ?

**జనవరి 17 పల్లె వెలుగు**




ఇప్పుడు అయిదు రాష్ట్రాలు శాసనసభల ఎన్నికలకు వెళ్లబోతున్నాయి గనక అందుకు సంబంధించిన విస్తృత దృశ్యాన్ని పరిశీలించవలసి వస్తున్నది. మనకున్న రిపబ్లిక్ రాజ్యాంగ కోణం నుంచి కూడా ఇది అవసరమవుతున్నది. మా పాఠకుల జ్ఞాపకాన్ని మరోసారి మేల్కొల్పవలసిన అవసరం కలుగుతున్నది. ఎందుకంటే హిందూత్వ ప్రేరిత ధ్వనుల మధ్య ఇప్పటికే మనమేదో హిందూ రాష్ట్రంలో ప్రవేశించినట్టే వాతావరణం సృష్టించబడుతున్నది. ఏమైనా ఎన్నికల ప్రజాస్వామ్యం ఇంకా పనిచేస్తూనే వుంది. అలాగే 1950 జనవరి 26న మొదలైన ప్రజాస్వామ్య లౌకిక వ్యవస్థ కూడా అప్పుడున్నంత బలమైన పునాదితోనే వుంది.మనకు ఇష్టమున్నా లేకున్నా ఎన్నికల గురించిన చర్చ రాజ్యాంగంలో రూపొందించుకున్న పరిధిలోనే జరగాల్సి వుంటుంది.ఎన్నికల వ్యవస్థ మొదటి నుంచి కూడా భారత దేశంలో సార్వత్రిక వయోజన ఓటింగు వుండాలని భావించింది. అప్పటికి అనేక యూరోపియన్ దేశాలలో పరిస్థితి అలా వుండేది కాదు కూడా. ఎన్నికల ద్వారా ప్రజాస్వామ్యం అంటే పార్లమెంటుకైనా, తమ తమ రాష్ట్రాల శాసనసభలకైనా ప్రాథమిక అవసరం అర్హులైన భారతీయులందరూ తమ ఓటుహక్కుతో తమ ప్రతినిధిని ఎన్నుకునే అవకాశముండాలి. ఈ విధమైన పద్ధతులలో మొత్తం ఎన్నికల ప్రక్రియకు ఆధ్వర్యం వహించే భారత ఎన్నికల సంఘం నిష్పాక్షికంగా వుండటం అత్యావశ్యకమైన అవసరం. ఈ కారణంగానే రాజ్యాంగం సమానఅవకాశం అని నొక్కి చెబుతోంది. మొదటి ఎన్నికలకు ఆధ్వర్యం వహించిన ఎన్నికల కమిషనర్ సుకుమార్ సేన్ పై దృక్పథాన్ని నిజం చేయడానికి రెండు కీలక చర్యలు తీసుకున్నారు. అర్హులైన వారందరిపేర్లు ఓటర్ జాబితాలో వుంచే బాధ్యత ఎన్నికల సంఘంపైనే పెట్టడం తప్ప వ్యక్తిగతంగా ఆ ఓటరుకు వదిలేయలేదు. రెండవది భారత పౌరుడై వుండాలనే మరో అవసరం ఎన్నికల సంఘానికి సంబంధించినంతవరకూ తనిఖీ చేసి నిర్ధారించుకునే పని పెట్టుకోలేదు. ఒకానొక నిర్దిష్ట ఓటరు పౌరసత్వాన్ని మరో పౌరుడు (బహుశా ఇరుగుపొరుగువారెవరైనా) సవాలు చేసిన సందర్భంలో మాత్రమే హోంశాఖ నిర్ధారించవలసి వుంటుందని భావించారు.అధికారం లేని 'సర్'. ఇప్పుడు మనం ఈ పరిస్థితిని పూర్తిగా తలకిందులు చేసిన ప్రక్రియ మధ్యలో వున్నాం. రాజ్యాంగం 324, 326, 327 అధికరణాల కింద ఎన్నికల కమిషన్‌కు విస్తారమైన అధికారాలు వున్నాయనే వాస్తవంతో విభేదించడం లేదు గానీ పౌర సత్వ నిర్ధారణ మాత్రం ఎ న్నికల సంఘానికి(ఇసిఐ)కి? అప్పగించబడలేదని చెప్పవలసి వుంటుంది. అయిదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలు జరగవలసిన తరుణంలో ఇసిఐ తనకు తానే పౌరసత్వ నిర్ధారణ బాధ్యత తీసుకోవడంతో ఈ పరిస్తితి తలకిందులుగా మారడం కనిపిస్తోంది. ఇసిఐకి విస్తార అధికారాలు వున్నప్పటికీ ఈ అధికారం మాత్రం లేదు. ఈఅంశం ఇంకా సుప్రీంకోర్టు విచారణలో వుంది. అత్యున్నత న్యాయస్థానం ఈ విషయంలో అంతిమంగా ఏమంటుందనేది అలా వుంచితేడ మనం ఇప్పటి వరకూ జరిగిన దాని ప్రభావమేమిటన్నది చూడవచ్చు. 2025 జూన్ 24న బీహార్‌లో మొదలైన ప్రత్యేక ఓటర్ల పరిశీలన (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-సర్) ఓటరు జాబితాలో కొనసాగేలా చూసుకోవలసిన బాధ్యత ఓటరుపైకి బదలాయించింది. గతంలోవలె గాక ఇప్పుడు ఓటర్లు తమ అర్హత కోసం కొన్ని ఫారాలు భర్తీ చేయాల్సి వచ్చింది. 2003 ఎన్నికల జాబితాలో వారు గాని, వారి తలిదండ్రులలో ఎవరో ఒకరు గానీ వుండి వుండాలి. రాజ్యాంగం కల్పించిన ఒక హక్కును కాపాడుకోవడానికి గాను తమ అర్హత నిరూపించుకోవడం ఎంతపెను సవాలుగా తయారైందో బీహార్‌లో సర్ గురించి సాగిన తీవ్ర చర్చ విధితం చేసింది.

# ఆ పేరు వింటేనే పరవశం

**-నేడు ఎన్టీఆర్ 30 వ వర్ధంతి**

**-నేడు ఆత్మకూరులో రక్తదాన శిబిరం**





**బండి ఆత్మకూరు పల్లె వెలుగు జనవరి 18 :**

తెలుగు ప్రజల ఆరాధ్య దైవం, నందమూరి తారక రామారావు. ఈ పేరు వింటేనే ప్రతి తెలుగు వాడి హృదయానికి ఒక పరవశం. మొన్నటి తరానికి సినీ కథానాయకుడిగా, నిన్నటి తరానికి ప్రజానాయకుడిగా, నేటితరానికి యుగపురుషుడిగా తర తరాలను తన్మయులను చేసే శక్తి నందమూరి తారక రామారావు. సినీ నటుడిగా నందమూరి తారక రామారావు పోషించిన పురాణ పురుషుల పాత్రలు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేస్తాయి. కథానాయకుడి పాత్రలతో పాటు ప్రతి నాయకుడి పాత్రలను పోషించి ప్రేక్షకులను మెప్పించి రంజింప జేయడంలో ఆయనకు ఆయనే సాటి. ఎన్టీఆర్ రాజకీయ రంగ ప్రవేశం ఒక ప్రభంజనం. పేద ప్రజల అన్నార్తుల ఆకలి కేకల నుండి పుట్టిందే తెలుగుదేశం పార్టీ అంటూ 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించి 1983 లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి మూడుసార్లు ఆ పదవిని చేపట్టి తెలుగువాడి ఆత్మ గౌరవాన్ని ఖ్యాతిని నలుగు దిశల పెంచిన నాయకుడు. తక్కువ సమయంలో కాంగ్రెస్ ఇతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి అయ్యారు. ఇది గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో చోటు సంపాదించుకుంది. నేషనల్ ఫ్రంట్ స్థాపనలో ఎన్టీఆర్ కీలక పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో తెలుగు ప్రజల ఆరాధ్య దైవం పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 30వ వర్ధంతిని పలు గ్రామాలలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసుకుంటున్నారు . పేద ప్రజల అభ్యున్నతి కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించిన అతి కొద్ది నెలలోనే ఎన్టీ రామారావు ముఖ్యమంత్రి పదవిని అధిష్టించిన సంగతిని ప్రజలు మననం చేసుకుంటున్నారు. ముఖ్యమంత్రి పదవిని అధిష్టించిన అనతి కాలంలోనే తమిళనాడు వాసులకు త్రాగునీటిని అందించాలన్న ఉద్దేశంతో వెలుగోడు వద్ద తెలుగు గంగ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తమిళనాడు వాసులకు తాగునీటి సంగతి అటు ఉంచితే వెలుగోడు నుండి తెలుగు గంగ రిజర్వాయర్ ద్వారా నీళ్లు సరఫరా కావడం ఈ ప్రాంత వాసులకు వరంగా మారింది.

ఎన్నో ఏళ్లుగా బీడు భూములుగా ఉన్న పొలాలు తెలుగు గంగ రిజర్వాయర్ ద్వారా నీటి విడుదలతో భూములు సస్యశ్యామలంగా మారిపోయాయి. రిజర్వాయర్ ఏర్పాటు కాకముందు ఈ ప్రాంతంలో ఎకరా పొలం ధర 1500 రూపాయలకు మించి ఉండేది కాదు. వెలుగోడు నారాయణపురం చిన్నదేవలాపురం ఈ ర్నపాడు,కడమల కాలువ,వెంగళరెడ్డిపేటతో పాటు మహానంది మండలాల తోపాటు నంద్యాల జిల్లాలోని వేలాది ఎకరాల భూములు సాగుకు నోచుకున్నాయి. భూములు సాగుకు నోచుకోవడం వల్ల అందుకు అనుగుణంగానే రేట్లు కూడా విపరీతంగా పెరిగిపోయాయి. ఈ ప్రాంతంలో ఎకరా భూమి 20 లక్షల రూపాయలకు పైబడి ఉందంటే నమ్మశక్యం కావడం లేదు. తెలుగు రిజర్వాయర్ ద్వారాజూ చెరువులకు నీళ్లు నింపుకుంటూ ఈ ప్రాంత రైతులు రెండు కార్లు పంటలను పండించుకుంటున్నారు. రైతులు రెండు కార్లు పంటలను పండించుకుంటూ నాలుగు మెతుకులు తింటున్నారంటే నందమూరి తారక రామారావు అని సగర్వంగా చెప్పవచ్చు. గతంలో కడుపునిండా తినడానికి కూడా తిండి గింజలు లేని పరిస్థితులు నెలకొని ఉండేవి. ఎన్టీ రామారావు కృషితో తెలుగు గంగ కాలువ ఏర్పాటు చేయడం వల్ల ప్రస్తుతం ఈ ప్రాంత రైతులంతా పదిమందికి అన్నం పెట్టే స్థాయికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలోనే తారకరామా! నిను మరువగలమా అంటూ ప్రజలు ఆయనను స్మరించుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన నాటి నుండి పేద బడుగు వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారు రెండు రూపాయలకే కిలో బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టారు. పేదలకు కూడు గుడ్డ కావాలని నినదించారు. వంటింటికే పరిమితమైన మహిళలకు స్ఫూర్తినిచ్చి రాజకీయ చైతన్య రగిలించారు రాజకీయాల్లో అవకాశాలను కల్పించారు. ఆస్తి హక్కులో మహిళలకు వాటా ఉండాలంటూ భాగస్వామ్యం కల్పించారు. పేద ప్రజల సంక్షేమం కోసం ఎంతో కృషిచేసిన నందమూరి తారక రామారావు వర్ధంతిని స్మరించుకుంటూ ఆయన సేవలను కొనియాడుతున్నారు . బండి ఆత్మకూరు, సంత జూటూరు, లింగాపురం, పెద్దదేవలాపురం ఈర్నపాడు, కడమల కాలువ, నారాయణపురం చిన్నదేవలాపురం, వెంగళరెడ్డిపేట, ఏ కోడూరు, సింగవరం, గ్రామాలలో ప్రతిష్ఠించిన ఎన్టీ రామారావు విగ్రహాలకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులను అర్పించేందుకు ఏర్పాటు చేసుకుంటున్నారు .

**-నేడు ఆత్మకూరులో రక్తదాన శిబిరం**

స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 30వ వర్ధంతిని పురస్కరించుకొని ఆత్మకూరులో ఆదివారం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబి రానికై ఏర్పాట్లు జరుగుతూ ఉన్నాయి. ఈ శిబిరానికి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అందరూ తరలివచ్చి శిబిరాన్ని విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ కార్యాలయం పిలుపునిచ్చింది.

# 19న 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక': జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి

**కలెక్టరేట్‌తో పాటు అన్ని కార్యాలయాల్లో వినతుల స్వీకరణ**

**అర్జీల స్థితిగతుల కోసం '1100' కు కాల్ చేయవచ్చు**




**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**

ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈ నెల 19వ తేదీ (సోమవారం) జిల్లా వ్యాప్తంగా 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (్రాబఎశ్రీఅఎ +తీఅవఋఅఎవ =వసతీవంయిశ్రీ ూఎర్‌వఎ) కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9:30 గంటల నుండి కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజల నుండి వినతులను స్వీకరించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. అన్ని స్థాయిల్లో కార్యక్రమం: జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో మరియు డివిజన్ స్థాయి కార్యాలయాల్లో కూడా ఈ కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులను ఆయా కార్యాలయాల్లో అందజేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. 1100 నంబర్‌తో సమాచారం: అర్జీదారులు తమ దరఖాస్తుల పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకోవడానికి ప్రభుత్వం కేటాయించిన కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి వివరాలు పొందవచ్చని కలెక్టర్ సూచించారు. అలాగే, ప్రజలు నేరుగా తమ ఫిర్యాదులను వెబ్‌సైట్‌లో కూడా నమోదు చేసుకోవచ్చని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# అప్పలరాజు విడుదలకు ఆదేశాలివ్వండి

**పల్లె వెలుగు**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల తరుపున పోరాటం చేస్తున్న ఎం.అప్పలరాజుపై పీడీ యాక్టు పెట్టి, అరెస్టు చేయడంపై జోక్యం చేసుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఎఐకెఎస్, ఎఐఎడబ్ల్యూయు విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు ఒక వినతిపత్రాన్ని సమర్పించాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చర్యల వల్ల ప్రజల రాజ్యాంగ హక్కులు, పౌర స్వేచ్ఛలు తీవ్రంగానూ, పద్ధతి ప్రకారం ఉల్లంఘించబడుతున్నందువల్ల రాష్ట్రపతిని ఆశ్రయించాల్సి వచ్చిందని ఈ లేఖలో పేర్కొన్నాయి.

# పల్లె వెలుగు దినపత్రిక వార్తల వేగం అమోఘం

**పల్లె వెలుగు దినపత్రిక నూతన క్యాలెండర్ ఆవిష్కరణలో నంద్యాల జిల్లా డీఈవో జనార్దన్ రెడ్డి.**




**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**

వార్త సమాచారం వేగంగా అందించడంలో పల్లె వెలుగు దినపత్రిక ముందుంటుందని నంద్యాల జిల్లా డీఈవో జనార్దన్ రెడ్డి అన్నారు. పల్లె వెలుగు దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను డీఈవో కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా డీఈఓ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ పల్లె వెలుగు దినపత్రిక యాజమాన్యానికి సిబ్బంది పాఠకులకు నంద్యాల నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సరం , సంక్రాంతి, రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలిపారు. మీడియా రంగంలో సాంకేతికతను అందిపుచ్చుకొని మెరుపు వేగంతో వార్తల అందిస్తూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉన్న పల్లె వెలుగు దినపత్రిక దినదినాభివృద్ధి చెంది మరిన్ని సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా డీఈవో జనార్దన్ రెడ్డి తో పాటు నంద్యాల జిల్లా బ్యూరో సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ పల్లె వెలుగు దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణను విజయవంతం చేశారు.

# 21 వ తేదీన శ్రీ చెన్నకేశవ ఆంజనేయస్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం

**ముఖ్య అతిథిలుగా హాజరు కావాలని మంత్రి ఎన్ఎండి ఫరూక్, ఎన్ఎండి ఫిరోజ్ లను ఆహ్వానించిన సభ్యులు.**






ఈనెల 21వ తేదీన మూలసాగరంలోని ప్రసిద్ధ శ్రీ చెన్నకేశవ ఆంజనేయస్వామి దేవస్థానం నూతన చైర్మన్ మరియు ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేయాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వక నేడు రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ మరియు తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ లను కమిటీ సభ్యులు స్వయంగా కలిసి ఆహ్వానించడం జరిగింది . ఈ కార్యక్రమంలో పాల్గొని నూతన పాలక మండలిని ఆశీర్వదించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నరసింహులు,కెఎల్ దీపక్ రెడ్డి, కామిని మల్లికార్జున, విశ్వనాథ్, శివరామ్ రెడ్డి, చంటి తదితరులు ఉన్నారు.

# మెదడు వ్యాధికి గురైన యువతి కుటుంబానికి 45 వేల నగదు ఆర్థిక సహాయం చేసిన సలీంనగర్, పీస్ ఫౌండేషన్ కమిటీ.



**పల్లె వెలుగు నంద్యాల రూరల్.**

సలీం నగర్ కు చెందిన ఒక బిటెక్ చదివే యువతికి జ్వరం వచ్చి మెదడు లో రక్త కణతి ఏర్పడటం ద్వారా అపస్మారక స్థితిలోనికి వెళ్లి, ప్రభుత్వ ఆసుపత్రులలో తగిన చికిత్స లేని కారణంగా, స్థానిక నంద్యాల, కర్నూలు కార్పొరేట్ హాస్పిటల్స్ లో చికిత్స జరుగుచున్నది. యువతి తండ్రి ఇటీవల మరణించిన కారణంగా వారి కుటుంబ ఆర్థిక స్థితి చాలా దయనీయంగా ఉన్న కారణంగా, సలీంనగర్ పీస్ ఫౌండేషన్ కమిటీ వారు స్థానిక మసీదులలోనూ దాతల ద్వారా సేకరించిన 45 వేల రూపాయలు ఈరోజు వారి కుటుంబ పెద్దలకు అందించి వారికి మనోధైర్యాన్ని ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సలీం నగర్ అధ్యక్షులు సమీవుల్లా ఖాన్, కౌన్సిలర్ బాసిత్ ఉపాధ్యక్షులు నూర్ బాషా, సెక్రెటరీ అబులైస్, వైస్ ట్రెజరర్ జావిద్, జబ్బార్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె వెలుగు
తెలుగు జాతీయ దిన పత్రిక
అవినీతిపై నిఘా
GST No.37ACDFM5465G1Z1
RNI-APTEL/2012/46499
ఆదివారం 18-01-2026

## శ్రీ మహానందిశ్వర వడ్డే, వడియరాజుల అన్న సత్రం 2026 క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.



**పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.**



నంద్యాలలోని మంత్రి క్యాంప్ కార్యాలయం వేదికగా శ్రీ మహానందిశ్వర వడ్డే, వడియరాజుల అన్న సత్రం 2026 నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్,టిడిపి నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ముఖ్య అతిథిలుగా హాజరై ఈ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ మహానంది వంటి పవిత్ర పుణ్యక్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం వడ్డే మరియు వడియరాజుల సంఘం ఆధ్వర్యంలో అన్న సత్రాన్ని నిర్వహించడం, సామాజిక సేవలో భాగస్వాములు కావడం అభినందనీయమని కొనియాడారు. కుల సంఘాలు ఐక్యంగా ఉంటూ సమాజ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య సలహాదారులు గోగుల హరిపోతులూరు, అధ్యక్షులు వేముల చిన్న వెంకటస్వామి, ప్రచార కార్యదర్శి వడ్డె జనార్ధన్, అధ్యక్షులు పల్లె చిన్న వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షులు మంజుల సుబ్బరాయుడు, హరి, సంపంగి జయకృష్ణ, కుంచపు వెంకట శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి పల్లెపు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్య భద్రతకు కూటమి అండా-ఎంపీ బస్తిపాటి నాగరాజు



**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**

పేదల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు...వెల్దుర్తి మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన మిద్దె శివ శంకర్ కి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వచ్చిన ఆర్థిక సహాయాన్ని ఆయన నగరంలోని తన కార్యాలయంలో అందజేశారు..శివ శంకర్ ఇటీవల కిడ్నీ కి సంబంధించిన సమస్యతో బాధపడుతూ ఓ ప్రైవేట్ అసువత్రి లో చికిత్స పొందాడు.. అనంతరం వైద్య ఖర్చుల నిమిత్తం ఎంపీ నాగరాజును సంప్రదించి, ఆయన సిఫార్సుతో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రూ.1,72,027 మంజూరయ్యాయి...సీ.ఎం.ఆర్.ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందడానికి కృషి చేసిన ఎంపీ కి లబ్దిదారుడు కృతజ్ఞతలు తెలిపాడు...ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురువ కార్పొరేషన డైరెక్టర్ పర్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

## 91 95500 52127: ఈ ఓ రామాంజనేయులు ఆధ్వర్యంలోదేవస్థానం నందు రక్తదాన-శిబిరం

**+91 95500 52127: పల్లెవెలుగు బేతంచెర్ల (జనవరి 17):-**



1/17/2026రి +91 95500 52127: (ఆర్ ఎస్ )రంగాపురం గ్రామ శివారులో వెలసిన శ్రీ మద్దులేటి నరసింహ స్వామి దేవ స్థానం నందు, నంద్యాల బ్లడ్ సెంటర్ వారి ఆధ్వర్యంలో,మెగా రక్తదాన శిబిరం ను, ఉప కమిషనర్ & దేవస్థానం కార్య నిర్వహణ అధికారి ఎం.రామాంజనేయులు సహాయ సహకారములతో నరసింహ స్వామి భక్తులతో శనివారం నాడు నిర్వహించడం జరిగింది.శ్రీ ఘన మద్దులేటీ స్వామిని, శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం భక్తులు రక్తమును దానం చేశారు.తల సేమియా, చిన్నారులు, గర్భిణీ మహిళల కోసం, ఈ మెగా రక్త దాన శిబిరంను ఏర్పాటు చేయడం జరిగిందని, నంద్యాల బ్లడ్ సెంటర్ డాక్టర్ల బృందం వారు తెలిపారు.

# వేమన్న మాటలు - నేటి కాలానికి సద్ది మూటలు

**పల్లె వెలుగు:**

తెలుగు వారి గుండెల్లో వేమనకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. రాయలసీమ ప్రాంతానికి చెందిన వేమనను కొందరు దైవసమానుడిగా కొలుస్తారు. వేమన పద్యం వంటబట్టని తెలుగువాడు లేడనడం అతిశయోక్తి కాదు. 'ఆటవెలది' ఛందస్సులో అద్భుతమైన పద్యాలను సృష్టించి, తెలుగు నేలపై అక్షర ముత్యాలను వెదజల్లారు ఆయన.వేమన తన తాత్విక దృష్టితో, సామాజిక స్పృహతో, జీవితానుభవంతో లోకంలోని నగ్నసత్యాలను ప్రజల ముందు ఉంచారు. మరుగున పడిపోయిన ఈ గొప్ప మానవతావాదిని ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత ఆంగ్లేయుడైన సి.పి. బ్రౌన్ కి దక్కుతుంది. 17వ శతాబ్దానికి చెందిన వేమన దాదాపు 3 వేలకు పైగా పద్యాలు రచించారని ప్రతీతి.సమాజ సంస్కర్తగా వేమన"విశ్వదాభిరామ వినురవేమ" అనే మకుటంతో ఆయన వేల పద్యాలను నీతి సూత్రాలుగా మలిచారు.ముఖ్యంగా సమాజంలోని మూఢనమ్మకాలు, కుల వివక్ష, మత మౌఢ్యంపై ఆయన సంధించిన విమర్శనాస్త్రాలు నేటికీ ఆలోచింపజేస్తాయి. నేటి కాలంలో వ్యక్తిత్వ వికాసానికి, వేమన పద్యాలకు మించిన సాహిత్యం లేదంటే ఆశ్చర్యం లేదు. పెద్ద పెద్ద గ్రంథాలు చదవాల్సిన పనిలేకుండా, ఆయన పద్యాలలోని లోతైన భావాన్ని పిల్లలకు వివరిస్తే వారి భవిష్యత్తు బంగారుమయమవుతుంది.(వేమన పద్యాల్లోని కొన్ని అద్భుత విశ్లేషణలు చూద్దాం:1.సాధనతో ఏదైనా సాధ్యమే పద్యం:అనగ నంగ రాగ మతిశయిల్లుచునుండు. దినగ దినగ వేము తియ్యగనుండు సాధనమున పనులు సమకూరు ధరలోన విశ్వదాభిరామ వినురవేమ. వివరణ: సాధన చేస్తే సాధ్యం కానిది ఏదీ లేదని వేమన ఈ పద్యం ద్వారా తెలియజేశారు. పాడుతూ ఉంటే రాగం మెరుగుపడుతుంది, తింటూ ఉంటే చేదు వేపాకు కూడా అలవాటై తీపిగా అనిపిస్తుంది. అలాగే నిరంతర సాధన ఉంటే ఎంతటి కష్టమైన పనైనా సులభంగా నెరవేరుతుంది. మనం చిన్నప్పుడు నేర్చుకున్న ఎక్కాలు, శ్లోకాలు ఇప్పటికీ గుర్తుండటానికి కారణం నాటి సాధనే.2. ఆవేశం అనర్థదాయకం పద్యం:తామసించి చేయ దగడెట్టి కార్యంబు వేగిరింప నదియు విషమె యగును పచ్చి కాయ దెచ్చి పండింప ఫలమౌనె విశ్వదాభిరామ వినురవేమ. వివరణ: మనిషి కోపంలో ఉన్నప్పుడు ఏ పనీ చేయకూడదు, ఎలాంటి నిర్ణయాలు తీసుకోకూడదు. తొందరపడి చేసే పనులు విషంతో సమానం. పచ్చికాయలను బలవంతంగా పండబెడితే అవి తియ్యని పళ్ళుగా మారవు కదా! అలాగే ఆవేశంతో చేసే పనులు సత్ఫలితాలను ఇవ్వవు. 3. వినయమే ఆభరణం పద్యం:అనువుగాని చోట నధికుల మనరాదు కొంచెమైన నదియు కొదువ గాదు కొండ యద్దమందు కొంచెమై యుండదా విశ్వదాభిరామ వినురవేమ! వివరణ: మనకు అనుకూలం లేని చోట గొప్పలకు పోకూడదు. అక్కడ తగ్గడం వల్ల మన గౌరవం ఏమీ తగ్గిపోదు. పెనుకొండ కూడా అద్దంలో చిన్నదిగానే కనిపిస్తుంది, అంతమాత్రాన కొండ పరిమాణం మారదు కదా! సందర్భాన్ని బట్టి ఒదిగి ఉండటం గొప్ప లక్షణం. 4. మానవత్వమే మిగిలేది పద్యం:మళ్ళు వెంట రావు మణులు వెంట రావు ఆలుబిడ్డలు హితు లరయ రారు తాను ఇచ్చు ఈవి తన వెంట వచ్చుగా విశ్వదాభిరామ వినురవేమ. వివరణ: మనిషి సంపాదించిన ఆస్తులు, మణులు, మాణిక్యాలు ఏవీ మరణానంతరం వెంటరావు. చివరకు భార్యాబిడ్డలు, బంధుమిత్రులు కూడా తోడు రారు. కేవలం మనం చేసిన దానధర్మాలు, లోకానికి చేసిన మేలు మాత్రమే మన పేరును చిరస్థాయిగా నిలబెడతాయి. 5.



అన్నదానమే మిన్న పద్యం:అన్నమిడుట కన్న నధిక దానంబుల నెన్ని చేయనేని యెన్నబోరు అన్నమెన్న జీవనాధార మగునయా విశ్వదాభిరామ వినురవేమ! వివరణ: లోకంలో ఎన్ని దానాలు చేసినా సంతృప్తి కలగదు. కానీ అన్నదానం చేస్తే మాత్రమే తిన్నవాడు "చాలు" అని తృప్తిగా చెబుతాడు. ప్రాణికోటి జీవించడానికి ఆధారమైన అన్నాన్ని పెట్టడం అన్నిటికంటే గొప్ప సంస్కారం. ముగింపు:నిజంగా వేమన ఒక ప్రజాకవి. సామాన్య జానపద భాషలో, ఆటవెలది ఛందస్సులో సమాజంలోని రుగ్మతలను తూర్పారబట్టిన విప్లవ సంస్కర్త ఆయన. భోగలాలసుడి నుంచి యోగిగా మారిన ఆయన ప్రయాణం ఆదర్శనీయం. అచ్చతెలుగు పదాలతో, ముచ్చటైన మూడవ పాదంతో సత్యాన్ని చాటిన వేమన పద్యాలు అక్షర గుళికలు.బాల్యంలోనే వేమన పద్యాలను పిల్లలకు నేర్పించి, వాటి అర్థాన్ని బోధిస్తే వారు ఉన్నతమైన విలువలు కలిగిన వ్యక్తులుగా ఎదుగుతారు. వేమన శతకం నిశ్చయంగా మనందరికీ ఒక సద్దన్నపు మూట వంటిది. అది ఆకలి తీర్చడమే కాక, జీవిత ప్రయాణానికి అవసరమైన శక్తిని, జ్ఞానాన్ని అందిస్తుంది.రచన:కొప్పుల ప్రసాద్, తెలుగు ఉపన్యాసకులు.

# అధికారిణికే తప్పని అంటరానితనం.. కర్నూలు జిల్లాలో కుల వివక్ష కోరలు!

**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**

కర్నూలు జిల్లా ఓర్వకల్ మండలం లో 'రాకెట్ యుగంలో ఉన్నాం.. అందరం సమానమే' అని మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్న సమాజానికి ఓర్వకల్ మండలంలో జరిగిన ఘటన చెంపపెట్టుగా మారింది. ఒక జిల్లా స్థాయి అధికారిణి అని కూడా చూడకుండా, కేవలం కులం పేరుతో దేవాలయంలోకి రాకుండా అడ్డుకోవడం సభ్య సమాజాన్ని తలదించుకునేలా చేస్తోంది. హద్దులు నిర్ణయించడానికి మీరెవరు? సోమయాజులపల్లి గ్రామంలోని సుంకులమ్మ ఆలయంలో గొందిపాల మాలతి అనే దళిత మహిళా అధికారిణికి చేదు అనుభవం ఎదురైంది. 20 ఏళ్లుగా పూజలు చేస్తున్న గుడిలోనే, పునరుద్ధరణ పేరుతో ఆమె భక్తిని అపహస్యం చేశారు. "నువ్వు మాలదానివి.. నీ హద్దు ఇదే.. లోపలికి రావద్దు" అంటూ పూజారి జనార్ధన్, అతని కుమారుడు వంశీ బరితెగించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు జిల్లావ్యాప్తంగా అగ్నిజ్వాలలు రేపుతున్నాయి. ఆమె కన్నీటి ప్రశ్న: 'మేము మనుషులం కాదా?'



బాధితురాలు మాలతి తన ఆవేదనను వెళ్లగక్కుతూ పదునైన ప్రశ్నలు సంధించారు: "నేను జిల్లా స్థాయి అధికారిణిని అని తెలిసీ ఇంతలా అవమానిస్తారా? మేము ఊడ్చేటప్పుడు, చనిపోయిన వారిని పాతిపెట్టేటప్పుడు మాలలము కావాలి కానీ, దేవుడిని దర్శించుకోవడానికి మాత్రం అంటరానివాళ్లమా? ఈ వివక్ష ఇంకా ఎన్ని తరాలు సాగాలి?"చట్టం తన పని తాను చేయాల్సిందే! పూజారి అహంకారానికి వ్యతిరేకంగా మాలతి ఓర్వకల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సునీల్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్సీ, ఎస్టీ



అట్రాసిటీ కేసు నమోదైన ఈ ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించకపోతే దళిత సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమించడానికి సిద్ధమవుతున్నాయి. దేవాలయం అందరిది.. భక్తి అందరిది.. కానీ వివక్ష మాత్రం కొందరి సొత్తా? అని ప్రజాస్వామ్యవాదులు ప్రశ్నిస్తున్నారు. డిమాండ్: నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని, అంటరానితనాన్ని ప్రోత్సహిస్తున్న ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుని బాధితురాలికి న్యాయం చేయాలని దళిత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# ట్రేడ్ బకాయిలపై 'కొరడా'

**షరాఫ్ బజార్‌లోని 196 దుకాణాలకు క్లోజర్ నోటీసులు**

**పల్లె వెలుగు కర్నూలు బ్యూరో**



నగరపాలక సంస్థకు రావాల్సిన ట్రేడ్ లైసెన్స్ బకాయిల వసూళ్లను నగరపాలక సిబ్బంది వేగవంతం చేశారు. బకాయిలు చెల్లించని వ్యాపారులపై సిబ్బంది కఠిన చర్యలు చేపడుతున్నారు. పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందించని దుకాణదారులపై నిబంధనల ప్రకారం చర్యలు కొనసాగుతున్నట్లు సిబ్బంది తెలిపారు. ఈ క్రమంలో శనివారం షరాఫ్ బజార్ పరిధిలో సుమారు రూ.15 లక్షల ట్రేడ్ లైసెన్స్ బకాయిలు చెల్లించని 196 దుకాణాలకు క్లోజర్ నోటీసులు జారీ చేశారు. అలాగే క్లోజర్ నోటీసులు జారీ చేసినప్పటికీ బకాయిలు చెల్లించకుండా వ్యాపారాలు కొనసాగిస్తున్న మూడు షాపులను సీజ్ చేశారు. మున్సిపల్ నిబంధనలను అతిక్రమిస్తూ వ్యాపారాలు నిర్వహించడం చట్ట విరుద్ధమని, బకాయిలు చెల్లించని పక్షంలో మరింత కఠిన చర్యలు తప్పవని ప్రజారోగ్య సిబ్బంది హెచ్చరించారు. ట్రేడ్ లైసెన్స్ బకాయిలు చెల్లించడం ప్రతి వ్యాపారి బాధ్యత అని పేర్కొంటూ, వెంటనే బకాయిలు చెల్లించి సహకరించాలని నగరపాలక సిబ్బంది వ్యాపారులను కోరారు. నగర అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణతో పాటు ప్రజా సౌకర్యాల నిర్వహణకు ఈ వసూళ్లు ఎంతో కీలకమని వివరించారు.ఈ తనిఖీల్లో శానిటేషన్ ఇంస్పెక్టర్ రమేష్ బాబు, ఆర్.రాజు, మునిస్వామి, అనిల్ కుమార్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె వెలుగు
తెలుగు జాతీయ దిన పత్రిక
అవినీతిపై నిఘా
RNI-APTEL/2012/46499
GST No.37ACDFM5465G1Z1



# రావి ఆకు మీద ఎన్టీఆర్ అన్న చిత్రం






నంద్యాల బ్యూరో. జనవరి 17 . (పల్లె వెలుగు ):
నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు కళారత్న చింతలపల్లె కోటేష్ ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని రావి ఆకు మీద వాటర్ కలర్స్ పెయింటింగ్స్ తో ఎన్టీఆర్ అన్న చిత్రాన్ని వేసి అలాగే మైక్రో బ్రష్ ద్వారా 650 తెలుగు అక్షరాలతో “అన్న ఎన్టీఆర్ కి భారతరత్న ఇవ్వాలి “అనే నినాదాలతో ఈ చిత్రంలో వ్రాసారు. ఈ చిత్రం వేయడానికి 3 గంటల సమయం పట్టిందన్నారు. ఈ సందర్భంగా కోటేష్ మాట్లాడుతూ నందమూరి తారకరామారావు తెలుగు సినిమా నటులు, తెలుగుదేశం పార్టీ వ్యవ స్థాపకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి. తెలుగు వారందరూ అన్న అని అభిమానంగా పిలుస్తారు. అన్న పౌరణికం, జానపదం,సాంఘికం వంటి చలన చిత్రాలలో నటించి పాత్రకు జీవం పోశారు. తన నటనతో తెలుగు ప్రజల హృదయాలల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ప్రపంచంలో నే పౌరణిక పాత్రలలో ఏ నటుడు చేయని పాత్రలు అన్న చేసారు. రాముడు, కృష్ణుడు, రావణుడు, దుర్యోధనుడు, భీష్ముడు, భీముడు, అర్జునుడు, కర్ణుడు ఇలా అనేకమైన పౌరణిక పాత్రలలో నటించి పాత్రలకు జీవం పోశారు. తెలుగు చిత్ర పరిశ్రమలో ఎన్నో మైలురాళ్లుగా నిలిచిన చిత్రాలు చేశారు. అందుకే అన్న ని కారణజన్ముడని, విశ్వ విఖ్యాత నట సార్వ భౌముడని అంటారు.మంచి రాజకీయ నాయకులు, ముఖ్యమంత్రిగా వున్నప్పుడు ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి మంచి పరిపాలన అందించారు. భారతీయ నటులు, చలన చిత్ర దర్శకులు, చలన చిత్ర నిర్మాతగా ఇలా ఎన్నో రకాల ఎదిగిన బహుముఖ ప్రజ్ఞశాలి అయిన అన్న కి భారతరత్న ఇవ్వాలని కోరుకుంటున్నాను. తెలుగు వారందరూ అన్నకి భారతరత్న ఇవ్వాలని కోరుకుంటున్నారు. అన్న గారంటే అభిమానంతో అన్న జయంతులకు,వర్ధంతులకు అన్న చిత్రాలను వినూత్నంగా వేస్తూ చిత్ర నివాళులు అర్పిస్తూ వుంటాను. ఈసారి రావి ఆకు మీద అన్న బొమ్మ వేసి, అన్న కి భారతరత్న ఇవ్వాలి అనే నినాదాలు వ్రాస్తూ వేసాను. జై ఎన్టీఆర్... జై జై ఎన్టీఆర్.

# కూటమి ప్రభుత్వం దళితులపై దాడులు హత్యలు ఆపాలి. వైసిపి



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.
కూటమి ప్రభుత్వం దళితులపై దాడులు హత్య రాజకీయాలు రెడ్బుక్ రాజ్యాంగాన్ని ఆపాలని, లేకపోతే ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని నంద్యాల వైఎస్ఆర్సిపి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు తిరుపతియ్య జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు కార్ రవికుమార్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇటీవల పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం పిన్నెల్లి గ్రామంలో మందా సాల్మన్ అనే దళితున్ని హత్యగావించిన సంఘటనపై నేడు నంద్యాల మాజీ శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఆదేశాల మేరకు నంద్యాల పట్టణంలోని బొమ్మల సత్రం అంబేద్కర్ విగ్రహం పట్టణంలోని బొమ్మల సత్రం సర్కిల్లో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జిల్లా ఎస్సీ సెల్, క్రిస్టియన్ మైనారిటీ సెల్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం దళితులపై చేస్తున్న దాడులు హత్యలు దారుణాలను తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు తిరుపతయ్య, జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు కారు రవికుమార్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత దళితులపై దాడులను కొనసాగిస్తున్నారని ఇప్పటికి ముగ్గురిని హత్య గావించడం దారుణమైన చర్యలని, ఈ రాజకీయ హత్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇటీవల పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం పిన్నెల్లి గ్రామంలో కూటమి ప్రభుత్వ కార్యకర్తలు మందా సాల్మన్ అనే దళితున్ని హత్య గావించడం హేయమైన చర్యలని పేర్కొన్నారు. దళితుల పక్షాన తానున్నానని చెబుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దళితులపై జరుగుతున్న దాడులు పై ఎందుకు నోరు విప్పడం లేదని సూటిగా ప్రశ్నించారు. దళితులపై దాడులు చేస్తే ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని హెచ్చరించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని అమలు చేయడం పేర్కొన్నారు. దళితులపై దాడులను ఆపాలని దళితులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్, జిల్లా మేధావుల విభాగం అధ్యక్షుడు రసూల్ ఆజాద్ , వైసీపీ జిల్లా సెక్రెటరీ దేవనగర్ బాషా,కౌన్సిలర్ చంద్రశేఖర్, జిల్లా వైసీపీ బీసీ సెల్ రామ లక్ష్మయ్య, వైసిపి నాయకుడు సాయిరాం రెడ్డి, మాజీ కౌన్సిలర్స్ మునయ్య, కన్నమ్మ, చాణిక్య రాజ్ ఎమ్మార్పీఎస్ రవికుమార్,పి జి ఈ కిరణ్, చల్ల సత్యం, చెన్న కేశవ,అరేల్, ఎర్రన్న, తిమ్మరాజు, దేవా, భాషీర్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాల భూముల పరిరక్షణకు సత్వర చర్యలు చేపట్టాలి







జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.
దేవాలయాలకు చెందిన భూములు ఎలాంటి అక్రమాలకు గురికాకుండా సత్వర చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్ ఆర్డీఓలు, తహశీల్దార్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో దేవాలయ భూముల పరిరక్షణ అంశంపై జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన ల్యాండ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్, బనగానపల్లె/డోన్ ఆర్డీఓ నరసింహులు, ఆత్మకూరు ఆర్డీఓ శివనాగజ్యోతి, దేవాదాయ శాఖ అధికారి మోహన్, జిల్లా రిజిస్ట్రార్‌తో పాటు దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ దేవాలయ భూముల పరిరక్షణ బాధ్యత సంబంధిత కార్యనిర్వహణాధికారులపై ఉందన్నారు. రీసర్వే జరుగుతున్న గ్రామాల్లో దేవాదాయ శాఖ సిబ్బంది తప్పనిసరిగా పాల్గొని దేవాలయాల పేర్లు సక్రమంగా నమోదు చేయించుకోవాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా దేవాలయ భూములు అక్రమ ఆక్రమణకు గురైనట్లయితే వెంటనే వాటిని గుర్తించి, తదుపరి సమావేశంలో చర్చించి ఆక్రమణదారులను తొలగించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దేవాదాయ శాఖకు సంబంధించిన భూముల పేర్లను ఆన్లైన్‌లో మ్యూటేషన్ చేయించే విధంగా సంబంధిత మండల తహశీల్దార్లకు సూచనలు జారీ చేయాలని ఆర్డీఓలను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

# వైఎస్ఆర్సీపీ కార్యకర్త సల్మాన్ హత్య హేయం: కల్లూరులో నేతల భారీ నిరసన



పల్లె వెలుగు కర్నూలు బ్యూరో
పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం పిన్నెల్లి గ్రామంలో వైఎస్ఆర్సీపీ కార్యకర్త మందా సల్మాన్ దారుణ హత్యను నిరసిస్తూ కల్లూరులో పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. వైఎస్ఆర్సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం కల్లూరులోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద పార్టీ నాయకులు, కార్పొరేటర్లు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. నిందితులను కఠినంగా శిక్షించాలి: కల్లూరు అర్బన్ 33వ వార్డు కార్పొరేటర్ మైతాపు నరసింహులు, వైఎస్ఆర్సీపీ యాక్టివిటీ సెక్రటరీ పాలకొలను రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో నేతలు మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైఎస్ఆర్సీపీ కార్యకర్తలపై జరుగుతున్న దాడులు, హత్యలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని మండిపడ్డారు. సల్మాన్ హత్యకు కారకులైన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం సమర్పించారు. పాల్గొన్న ముఖ్య నేతలు: ఈ నిరసన కార్యక్రమంలో కార్పొరేటర్లు సంగాల సుదర్శన్ రెడ్డి, నారాయణ రెడ్డి, గాజుల శ్వేతా రెడ్డి, పందిపాడు శివ శంకర్ రెడ్డి తమ సంఘీభావాన్ని ప్రకటించారు. అలాగే రైతు సంఘం నాయకులు రంగప్ప, తిరుపాల్, తిరుమలేష్ గౌడ్, చెట్ల మల్లాపురం మధు, బజారి, విష్ణు, నాయుడు, రాజేష్ తదితర నాయకులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. కార్యకర్తల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఇలాంటి ఫ్యాక్షన్ రాజకీయాలు మానుకోవాలని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.

# నూతనంగా వీధి దీపాలు ఏర్పాటు.





పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.
నంద్యాల టౌన్ వై.యస్.ఆర్ నగర్ మరియు నందమూరి నగర్ వెళ్లే రహాదారి నందు రాణి మహారాణి మరియు కుందూనది సమీపంలో ట్రాఫిక్ సీఐ చాంద్ బాషా చొరవతో స్థానిక న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ ఎం డి.ఫరూక్, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎం డి.ఫిరోజ్, రాష్ట్ర యువ నాయకుడు ఎన్ ఎం డి.ఫయాజ్ ఆదేశాల మేరకు 38వ వార్డు టీడీపీ ఇంచార్జి తాటికొండ బుగ్గరాముడు ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది తో కలసి నూతనంగా వీధి దీపాలు ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు హిమామ్ హుస్సేన్,వడ్డే నాగేంద్ర, జగన్ కుమార్,అంకన్న మరియు ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది మరియు మున్సిపాలిటీ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మట్టి టిప్పర్లతో ట్రాఫిక్కు అంతరాయం





మహానంది, పల్లె వెలుగు
మహానంది మండలం గాజులపల్లె మెట్టపై ట్రాఫిక్ జామ్‌తో వాహనాదాలు, ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. శనివారం నంద్యాల-గాజులపల్లె జాతీయ రహదారిపై మెట్ట వద్ద అధిక లోడుతో ఎర్రమట్టి తరలిస్తున్న టిప్పర్లు ఆగడంతో ట్రాఫిక్ ఏర్పడింది. ఎర్రమట్టిని తరలించేటప్పుడు అతివేగంగా రవాణా చేయడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు తెలిపారు. నాలుగు కూడలి రహదారిలో నిత్యం వేల సంఖ్యలో వాహనాలు, ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. అతివేగంతో వచ్చే టిప్పర్ల ద్వారా ఏమైనా అనుకోని ప్రమాదాలు సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని తెలిపారు.అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పల్లె వెలుగు
తెలుగు జాతీయ దిన పత్రిక
అవినీతిపై నిఘా
RNI-APTEL/2012/46499
GST No.37ACDFM5465G1Z1
ఆదివారం 18-01-2026

# జాతీయ ప్రతిభా పురస్కారానికి దేవులపల్లి రమేశ్ ఎంపిక



**సిద్దిపేట, నంగునూర్, జనవరి 17**

నంగునూరు మండల కేంద్రానికి చెందిన కవి, రచయిత దేవులపల్లి రమేశ్, మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల అతిథి ఉపాధ్యాయుడు. శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్,మరియు గోదావరి సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్, సంయుక్త ఆధ్వర్యంలో ప్రాచీన కవుల వారసులచే నిర్వహించే, సాహితీ సాంస్కృతిక,పట్టాభిషేక మహోత్సవము,భాగంగా జాతీయ ప్రతిభా పురస్కారానికి కవి, దేవులపల్లి రమేశ్, అక్షర సేవలను, సాహిత్య సాంస్కృతిక తపనను సృజనాత్మకతను గుర్తించి, సాహిత్యానికి కృషి చేస్తున్నందుకు జాతీయ ప్రతిభ పురస్కారనికి ఎంపిక చేసినట్లు శ్రీశ్రీ కళా వేదిక, మేనేజింగ్ డైరెక్టర్ డా.కత్తి మండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం, ప్రపంచ తెలుగు, సంస్కృతిక కళావేదిక,వారు తెలిపారు. ఈ నెల తేది 21బుధవారం విజయవాడలో జరిగే ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆడిటోరియం,నందు జాతీయ ప్రతిభ పురస్కారం ప్రదానం చేయునట్లు దేవులపల్లి రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా రచయిత రమేశ్ ను సాహితివేత్తలు,పలువురు అభినందించారు.

# రోడ్డు ప్రమాదాలపై డ్రైవర్లకు అవగాహన కల్పించిన నంద్యాల జిల్లా పోలీసు అధికారులు.






**పల్లె వెలుగు నంద్యాల క్రైమ్.**

గౌరవ కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ. ప్రవీణ్ ఐపీఎస్ ఆదేశాలమేరకు మరియు నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ సూచనలతో ప్రతి శనివారం "రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం" నిర్వహించబడుతుంది. ఈ సందర్భంలో నంద్యాల జిల్లాలోని పోలీస్ స్టేషన్ ల పరిధిలో ముఖ్యమైన ప్రాంతాలలో పోలీసు అధికారులు ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల పై సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించారు. వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుంది. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్సులు వాహనాలకు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని మరియు పరిమితికి మించి ప్రయాణికులను సరుకులను రవాణా చేయరాదు. బైక్ లు నడిపే వారు ఖచ్చితంగా హెల్మెట్లు ధరించే విధంగా , ఓవర్ స్పీడ్ , ఓవర్ లోడ్ తో వాహనాలు వెళ్ళకుండా, డ్రంకెన్ డ్రైవ్ చేయరాదని తదితర రోడ్డు భద్రత ప్రాముఖ్యతల పై ప్రజలకు అవగాహన కల్పించారు.

# లలిత నగర్ లో అనుమానాస్పద మృతి.







**పల్లె వెలుగు నంద్యాల క్రైమ్.**

నంద్యాల పట్టణం లలిత నగర్ లో చోటు చేసుకున్న విషాద ఘటనలో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. మల్లికా అనే వివాహిత ఉదయమే ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. అంతకుముందు తన ఇద్దరు చిన్నారులకు పాలల్లో ఎలుకల మందు కలిపి తాగించిందని బంధువులు తెలిపారు. ఈ ఘటనలో తల్లి సహా ఇద్దరు పిల్లలు మృతి చెందారు. బంధువుల కథనం ప్రకారం, ఘటన జరిగిన రాత్రి భర్త ఉదయ్ ఇంట్లో లేడని తెలుస్తోంది. అయితే భర్తే ఈ ఘాతుకానికి పాల్పడి బయటకు వెళ్లి ఉండవచ్చని కొందరు బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజులుగా ఇంట్లో భార్యాభర్తల మధ్య తీవ్ర స్థాయి గొడవలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. మృతురాలి భర్త ఉదయ్ నంద్యాలలో ఫర్టిలైజర్స్ షాప్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. మృతి చెందిన పిల్లల్లో ఒకరు మగ పిల్లవాడు, మరొకరు ఆడ పిల్ల. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భార్యాభర్తల మధ్య కలహాలు, భర్త పాత్రపై వచ్చిన ఆరోపణలు సహా అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఎర్రమట్టి తవ్వకాలను ఆపాలి: ఎమ్మార్పీఎస్








**మహానంది, పల్లె వెలుగు**

ఎర్రమట్టి తవ్వకాలను ఆపాలని మహానంది- సిరివెళ్ల మండలాల ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సిరివెళ్ల మండలం మహాదేవపురం పరిధిలో జెసిబి మిషన్తో తొవ్వి టిప్పర్ల ద్వారా తరలిస్తున్న ఎర్ర మట్టి ప్రదేశాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ..సిరివెళ్ల మండల పరిధిలోని పోలేరమ్మ, శ్రీ సర్వ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి, పొలాలకు, వెళ్లే రాస్తాను జెసిబి యంత్రంతో తవ్వి ఇటుక బట్టీలకు తరలిస్తున్న అధికారులు పట్టించుకోవడంలేదని తెలిపారు. నంద్యాల- గాజులపల్లె రహదారి నిత్యం రద్దీ ప్రాంతం కావడంతో వాహనాలు అతివేగంగా మట్టిని తీసుకు వెళ్తున్న సమయంలో, ఏమైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. యదేచ్ఛగా భారీ టిప్పర్లతో ఎర్రమట్టిని తరలిస్తున్న రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు కన్నెత్తి చూడకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి ఎర్రమట్టి తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహానంది- సిరివెళ్ల మండలాల ఎమ్మార్పీఎస్ నాయకులు జి. నరసింహులు, గూడ పోగుల నరసింహులు, గద్దం ఈశ్వరయ్య,రవికృష్ణ, పెద్ద ఉసేని, మోష, సాలయాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# న్యాయం గెలిచింది

**ఆదోని టూ టౌన్ సిఐ శ్రీధర్ చాకచక్యం.**

**ఆదోని సబ్ జైల్ 'ఫేక్ వారెంట్' కేసులో చారిత్రాత్మక తీర్పు.**

**8 మందికి మూడేళ్ల జైలు శిక్ష 10 వేలు జరిమానా.**





**ఆదోని (పల్లె వెలుగు):**

వివరాలు వెల్లడించిన ఆదోని సిఐ రాజశేఖర్ రెడ్డి వివరాల్లోకి వెళితే ఆదోని పట్టణంలో సుమారు13 సంవత్సరాల క్రితం సంచలనం సృష్టించిన 'ఫేక్ వారెంట్' జైలు పరారీ కేసులో ఈరోజు న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఎనిమిది మందికి మూడేళ్ల జైలు శిక్ష మరియు 10,000 వేల రూపాయల జరిమానా విధిస్తూ ఆదోని జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ తీర్పునిచ్చారు. 2013వ సంవత్సరంలో జగపతి అలియాస్ (నాని) అనే వ్యక్తి చీటింగ్ కేసులో ఆదోని సబ్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. ఆ సమయంలో సినిమా ఫక్కీలో ప్లాన్ వేసిన ముద్దాయి. ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ పేరుతో ఒక నకిలీ (ఫేక్) వారెంట్‌ను సృష్టించాడు. ఈ కుట్రలో ఆత్మకూరు కు చెందిన కోర్టు క్లర్క్ మధుసూదన్ మరియు మాధవరం లో కానిస్టేబుల్ గా అప్పుడు విధులు నిర్వహిస్తున్న రఘునాథ్ సహకరించడం గమనార్హం. వారి సాయంతో తప్పుడు పత్రాలు సమర్పించి జైలు నుండి తప్పించుకుపోయాడు. అప్పటి రెండవ పట్టణ సిఐ శ్రీధర్ చాకచక్యం ఈ అక్రమ విడుదలపై అప్పటి సబ్ జైలర్ ఇచ్చిన ఫిర్యాదుతో ఆదోని టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి సిఐ శ్రీధర్ ఈ కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. నిందితుడు ఎలా తప్పించుకున్నాడు. ఈ కుట్రలో ఎవరెవరు సహకరించారు. అనే కోణంలో లోతైన విచారణ జరిపి, సాంకేతిక ఆధారాలతో సహా నిందితులందరినీ పట్టుకున్నారు. సాక్ష్యాధారాలను పక్కాగా సేకరించి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేయడంలో సిఐ శ్రీధర్ కీలక పాత్ర పోషించారు. నేటి తీర్పు దీర్ఘకాలం పాటు సాగిన ఈ విచారణలో నేరం రుజువు కావడంతో, గౌరవ మెజిస్ట్రేట్ 8 మంది ముద్దాయిలకు కఠిన శిక్ష విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అయితే 8 మందిలో ఒక ముద్దాయి చనిపోవడం జరిగిందని మిగతా ఏడుగురు బ్రతికి ఉన్నారని ఆదోని టూ టౌన్ సి ఐ రాజశేఖర్ రెడ్డి విలేకర్ల సమావేశంలో తెలిపారు. వ్యవస్థను తప్పుదోవ పట్టించి జైలు నుండి తప్పించుకోవాలని చూస్తే చట్టం ఊరుకోదని ఈ తీర్పు ద్వారా మరోసారి నిరూపితమైంది.

# శ్రీశైలం లో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు - పూర్ణాహుతి









**పల్లె వెలుగు శ్రీశైలం....**

శ్రీశైల మహా క్షేత్రంలో మకరసంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకుని పంచాహ్నికదీక్షతో ఏడురోజులపాటు నిర్వహింపబడే సంక్రాంతిబ్రహ్మోత్సవాలలో ఆరవరోజైన ఈ రోజు శ్రీ స్వామిఅమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించబడ్డాయి. తరువాత శ్రీస్వామివారి యాగశాలలో శ్రీచండీశ్వరస్వామివారికి ప్రత్యేక పూజాదికాలు జరిపించబడ్డాయి. అనంతరం పూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూలస్నానం, మహదాశీర్వచనం జరిపించబడ్డాయి. పూర్ణాహుతి కార్యక్రమంలో శాస్త్రోక్తంగా నారికేళాలు, పలు సుగంధద్రవ్యాలు, నూతన వస్త్రాలు మొదలైన ద్రవ్యాలను హోమగుండంలోకి ఆహుతిగా సమర్పించి యాగపూర్ణాహుతి కార్యక్రమాన్ని పూర్తి చేయడం జరిగింది. అనంతరం వసంతోత్సవం జరిపించబడింది. అనంతరం జరిగిన వసంతోత్సవంలో ఆలయ అర్చకులు, వేదపండితులు వసంతాన్ని (పసుపు, సున్నం కలిపిన మంత్ర పూరిత జలం) సమంత్రకంగా భక్తులపై ప్రోక్షించారు. తరువాత జరిగిన అవబృథస్నానంలో చండీశ్వరస్వామికి ఆలయపుష్కరిణి వద్ద ఆగమ శాస్త్రోక్తంగా స్నపన కార్యక్రమం నిర్వహించబడింది. చివరగా త్రిశూలస్నాన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి శ్రీ ఎం. శ్రీనివాసరావు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు దేవకి వెంకటేశ్వర్లు, ప్రత్యేక ఆహ్వానితులు ఎ. శ్రీనివాసులు, ప్రధానార్చకులు స్థానాచార్యులు (అధ్యాపక) వేదపండితులు, అర్చకస్వాములు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సదస్యం నాగవల్లి సంక్రాంతి బ్రహ్మోత్సవాలలో భాగంగానే ఈ రోజు సాయంత్రం స్వామిఅమ్మవార్ల నిత్యకల్యాణమండపంలో సదస్యం మరియు నాగవల్లి కార్యక్రమాలు జరిపించబడుతాయి. సదస్యం కార్యక్రమంలో వేదపండితులచే వేదస్వస్తి, నిర్వహించబడుతుంది. నాగవల్లి కార్యక్రమంలో సంక్రాంతి పర్వదినాన కల్యాణోత్సవం జరిపించబడిన అమ్మవారికి ఆగమశాస్త్రం సంప్రదాయం మేరకు మెట్టెలు, నల్లపూసలు సమర్పించబడుతాయి. ధ్వజావరోహణ బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం సాయంకాలం ధ్వజావరోహణ కార్యక్రమం జరిపించబడుతుంది. ఈ ధ్వజావరోహణ కార్యక్రమంలో ఉత్సవాల మొదటిరోజున బ్రహ్మోత్సవ ప్రారంభ సూచకంగా ఆలయధ్వజస్తంభంపై ఆవిష్కరింపజేసిన ధ్వజపటం అవరోహణ చేయబడుతుంది. నేటి తో ముగియనున్న సంక్రాంతి బ్రహ్మోత్సవాలు నేటి సాయంకాలం శ్రీ స్వామిఅమ్మవార్లకు అశ్వవాహనసేవ మరియు ఆలయ ఉత్సవం జరిపించబడుతుంది. ఆలయ ఉత్సవం అనంతరం శ్రీ స్వామిఅమ్మవార్లకు పుష్పోత్సవం, ఏకాంతసేవ, శయనోత్సవం జరిపించబడుతాయి.

# స్వామి అమ్మవార్లకు వెండి వస్తువుల విరాళం





పల్లె వెలుగు శ్రీశైలం...
శ్రీశైలంలో యం. జ్యోతిర్మయి, హైదరాబాద్ వారు ఒక వెండి పళ్ళెం, రెండు వెండి గిన్నెలు మరియు ఒక వెండి దీపం దేవస్థానమునకు విరాళంగా సమర్పించారు. ఈ వెండి వస్తువుల బరువు 630 గ్రాములు అమ్మవారి ఆలయప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో దాతలు వీటిని పర్యవేక్షకులు గంజి రవి, అమ్మవారి ఆలయం ఇన్‌స్పెక్టర్ కె. మల్లికార్జున, జూనియర్ అసిస్టెంట్ ఎం. సావిత్రికి అందజేశారు. అనంతరం వీరికి తగు రశీదును అందజేసి వేదాశీర్వచనముతో శ్రీస్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలను, ప్రసాదాలు అందజేయడం జరిగింది.

# ఘనంగా స్వర్గీయ ఎన్టీఆర్ చిత్రపటాల ఆవిష్కరణ




చిత్రపటాలను విడుదల చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్.
నంద్యాలలో రేపు ఘనంగా ఎన్టీఆర్ 30వ వర్ధంతి కార్యక్రమాలు.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.
తెలుగు జాతి గర్వించదగ్గ నాయకుడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి 30వ వర్ధంతిని పురస్కరించుకుని, శనివారం నంద్యాలలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటాలను రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ , నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ , ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ చైర్మన్ మహమ్మద్ ఫరూక్ షూబ్లీ ,స్టేట్ వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షేక్ అక్రమ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచవ్యాప్తం చేసిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. రేపు (జనవరి 18న) నిర్వహించనున్న 30వ వర్ధంతి వేడుకలను పురస్కరించుకుని కార్యకర్తలు, అభిమానులు ఆయన ఆశయ సాధనకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. రేపు నంద్యాల నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

# క్రికెట్ కొట్లాట





నిర్వాహకుల తీరుపై ప్రేక్షకులు అసంతృప్తి.
హద్దులు మీరుతున్న ఆటల పోటీలు.
జరగరానిది జరిగితే ఎవరు బాధ్యులు.
స్వలాభాల కోసం ప్రేక్షకుల మనోభావాలతో ఆటలు.

ఆదోని (పల్లె వెలుగు):
క్రీడలు అంటేనే మానసిక ఉల్లాసం అలాంటి క్రీడలు హద్దులు మీరితే పరిస్థితి ఎక్కడ వరకు వెళ్తుందో ఎవరు కూడా ఊహించరు. క్రీడాకారుల్లో ఆటలతో పాటు క్రమశిక్షణతో కూడిన ఆటలాడినప్పుడే అసలైన విజయం సొంతం అవుతుంది. మరి అలాంటి క్రీడలు ఒక్కసారిగా హద్దులు మీరి తారాస్థాయికి చేరితే పరిస్థితి ఎలా ఉంటాయో ఊహించలేము. సరిగ్గా అదే మున్సిపల్ మైదానంలో జరిగిన క్రికెట్ పోటీల్లో క్రీడాకారుల మధ్య ఆటగాళ్ల విషయంలో ఒకరికొకరు వాదోపవాదనాలకు దిగారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పట్టణం ఉన్న మున్సిపల్ మైదానంలో ఆదోని చాంపియన్ ట్రోఫీ 2026 క్రికెట్ పోటీలు నిర్వాహకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం జరగాల్సిన సెమీఫైనల్ మ్యాచ్లో క్రీడాకారుల మధ్య చోటు చేసుకున్న ప్లేయర్స్ విషయంలో గందరగోళంగా మారిందని చెప్పవచ్చు. నిలిచిపోయిన సెమీఫైనల్ మ్యాచ్ శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభం కావాల్సిన మ్యాచ్, ప్లేయర్ల విషయంలో తలెత్తిన విభేదాల కారణంగా గందరగోళంగా మారింది. జట్ల మధ్య సుదీర్ఘంగా సాగిన చర్చలు, వాగ్వివాదాల వల్ల మ్యాచ్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. టోర్నమెంట్ నిర్వాహకుడు ముజీబ్, జనసేన పార్టీ ఇంచార్జ్ మల్లప్ప లు జోక్యం చేసుకుని ప్లేయర్లకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. క్రీడాకారులు పట్టు వీడకపోవడంతో మైదానంలో గంటల తరబడి ఉత్కంఠ నెలకొంది. ఈ టోర్నమెంట్‌లో ప్రారంభం నుంచి సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపణలు వస్తున్నాయి. ప్రతి మ్యాచ్‌కూ ఏదో ఒక వివాదం తలెత్తుతుండటం, వాటిని పరిష్కరించడంలో నిర్వాహకులు విఫలమవ్వడంపై క్రీడాభిమానులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చివరికి పోలీసులు రంగ ప్రవేశం చేసినా, క్రీడాకారులు వినే పరిస్థితి లేకపోవడం గమనార్హం. మ్యాచ్‌లను వీక్షించేందుకు భారీ సంఖ్యలో తరలివచ్చిన ప్రేక్షకులు నిర్వాహకుల తీరుపై మండిపడుతున్నారు. సమయస్ఫూర్తిని కోల్పోయి ప్రతి మ్యాచ్‌కు ఇలాగే గొడవలు జరుగుతుంటే ఇక ఆట ఎప్పుడు చూస్తాం అని వారు ప్రశ్నిస్తున్నారు. సమయపాలన లేకపోవడం, గొడవలను నియంత్రించ లేకపోవడం నిర్వాహకుల అసమర్థతకు నిదర్శనమని ప్రేక్షకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారి స్వలాభాల కోసం ప్రేక్షకులతో ఆటలాడుతున్నారని క్రికెట్ ను చూడడానికి వస్తున్న ప్రేక్షకులు ఆరోపణలు చేస్తున్నారు.

# బైక్ ర్యాలీ జయప్రదం చేయండి.

ఆదోని (పల్లె వెలుగు)



ఆదోని జిల్లా సాధన జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నాయకుల పిలుపుమేరకు సోదర,సోదరీమణులు అందరూ ఆహ్వానితులే ఆదోని జిల్లా పోరాట వీరుల అందరికీ ఉద్యమ అభివందనాలు మనము 64 రోజులుగా ఆదోనిని జిల్లాగా ప్రకటించాలి అనిమన ఆదోనిలో జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు, ర్యాలీలు, రాస్తారోకోలు పాదయాత్రలు బంద్ లు చేస్తున్నాం, కాబట్టి ప్రభుత్వం ఒక మెట్టు కింద దిగింది మనతో చర్చలు జరుపుతోంది. "ఆదోని జిల్లా మన హక్కు", మన హక్కు సాధించుకొనుట కోసం మన పోరాటాలు ఉద్రిక్తం చేసే అవసరం ఎంతైనా ఉంది, దసరా వారిగా ఉద్యమాలను ఉధృతం చేసేందుకు అందులో భాగంగానే ఆదోని జేఏసీ ఆదోని జిల్లా కోసం ఈనెల18వ తేదీ18.1.26 ఆదివారం ఉదయం 10 గంటలకు మున్సిపల్ గ్రౌండ్ నుంచి బైపాస్ రోడ్ బసవేశ్వర సర్కిల్ వరకు బైక్ ర్యాలీ ఉంటుంది. దయచేసి పట్టణ ప్రజలు వివిధ రంగాలు అనగా, వ్యాపార వర్గాలు,కుల సంఘాలు, రాజకీయ నేతలు, కార్యకర్తలు, విద్యార్థి సంఘాలు, ఉద్యోగ సంఘాలు, అసోసియేషన్లు,(మేధావులు, డాక్టర్ల, విద్య సంస్థల అధినేతలు, న్యాయవాదులు, రైతులు, కూలీలు, కార్మికులు, కర్షకులు మహిళలు పురుషులు అని భేదం లేకుండా బైక్ లేదా స్కూటర్ లేదా కార్ ఉన్న ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఈ ర్యాలీని జయప్రదం చేయాలని ఆదోని జిల్లా జేఏసీ నాయకులు అన్నారు.

# ప్రభుత్వ భూములపై కబ్జాకోరుల కన్ను

ప్రభుత్వ స్థలాలు, భూములను పరిరక్షించాలి.
ఆదోని తహసిల్దార్ కార్యాలయంలో భూ రికార్డులు ప్రక్షాళన చేయాలి.
సిపిఎం పార్టీ నాయకులు ఆదోని.



ఆదోని (పల్లె వెలుగు):
నియోజకవర్గం లో ప్రభుత్వ స్థలాలు, భూములను పరిరక్షించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలన ఇన్చార్జి అధికారి సిపిఎం పార్టీ జిల్లా సీనియర్ నాయకులు ఈరన్న, పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, నాయకులు గోపాల్, తిప్పన్న, వీరేష్, కృష్ణమూర్తి,తదితరులు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం వీరు మాట్లాడుతూ ఆదోనిలో ప్రభుత్వ స్థలాలు పరిరక్షించడంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా ఉంటున్నారని వారు తెలిపారు. రహదారులు, వంకలు, వాగులు, స్మశాన వాటిక స్థలాలు, కొండ పరంపోగు స్థలాలు లాంటి వాటిపై కొంతమంది డేగా కన్నుతో అధికారుల సహకారంతో స్థలాలు గుర్తించి, వాటిని కబ్జా చేసే ప్రయత్నం జరుగుతున్న రెవెన్యూ అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా ఉన్నారని వారు తెలిపారు. అదేవిధంగా పేదలకు ఇస్తున్న ఇంటి స్థలాలు ఓకే ఇంటి పట్టాను పేర్లు మార్పుతో ఇద్దరు,ముగ్గురికి ప్రభుత్వ స్థలాలు ఇస్తూ ఒకరిపై ఒకరు గొడవలకు దారి తీసే విధంగా అధికారులు చేస్తున్నారని వారు మండిపడ్డారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి ఉన్నత అధికారులు ఆదోని రెవెన్యూ కార్యాలయంలో ఉన్న భూ రికార్డులను ప్రక్షాళన చేస్తూ ఒకే పట్టా ఒకరికి ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో బాధితులు అందరితో కలిపి తహసిల్దార్ కార్యాలయం ముందు ఆందోళనలు నిర్వహిస్తామని వారు తెలిపారు.

# 1/17/2026 రి +91 95500 52127: మన రైతు వాణి నూతన డైరి 2026 ఆవిష్కరణ.



1/17/2026రి +91 95500 52127: పల్లెవెలుగు బేతంచెర్ల (జనవరి 17):--
1/17/2026రి +91 95500 52127: మన రైతువాణి నూతన డైరి 2026 ను, శ్రీమద్దులేటీ స్వామి దేవ స్థానం నందు, ఉపకమిషనర్ & దేవస్థానం కార్య నిర్వహణ అధికారి ఎం. రామాంజనేయులు నూతన మన రైతువాణి డైరీని శనివారం రిలీజ్ చేశారు. వారు మాట్లాడుతూ రైతు లందరు పాడి పంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని దేవుణ్ణి కోరుకుంటూన్నమన్నారు, ఈ కార్యక్రమంలో ఎ.పి. రైతుసంఘం నంద్యాల జిల్లా, ఉపాధ్యక్షులు వి. సుబ్బరాయుడు,ఎపి.రైతుసంఘం బేతంచెర్ల మండల కార్యదర్శి పుల్లెం రామ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె వెలుగు
తెలుగు జాతీయ దిన పత్రిక
అవినీతిపై నిఘా
GST No.37ACDFM5465G1Z1
RNI-APTEL/2012/46499
ఆదివారం 18-01-2026

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




పోరుమామిళ్ల /కలసపాడు, జనవరి 17( పల్లె వెలుగు )

కలసపాడు పట్టణంలోని జెడ్పిహెచ్ ఉన్నత పాఠశాలలో 20012002 విద్యా సంవత్సరానికి సంబంధించి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 24 సంవత్సరాల తరువాత మళ్లీ ఒకే వేదికపై వారు చదివిన పాఠశాలలో కలుసుకున్న సహచరులు తమ పాఠశాల రోజుల జ్ఞాపకాలను తలుచుకుంటూ భావోద్వేగంగా మాట్లాడుకున్నారు. ఒకరికొకరు వారి జీవన ప్రమాణాలు, వృత్తి, విజయాలు, ఉపాధ్యాయుల సేవలను గుర్తు చేసుకుంటూ ఆనందం పంచుకున్నారు. పాఠశాల అభివృద్ధికి విద్యార్థులు సహకారం అందించాలని, భవిష్యత్ తరాలకు మార్గదర్శకులుగా నిలవాలని నిర్ణయించారు. విద్యార్థులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమం స్నేహ బంధాలను మరింత బలపరిచే వేదికగా నిలిచింది. కార్యక్రమంలో నారాయణరెడ్డి, పి ఈ టి భాస్కర్ వీరారెడ్డి, కరిముల్లా, కాశిరెడ్డి, శ్రీరాములు, పెంచల్ రెడ్డి, శ్రీలత, నారాయణమ్మ, రమాదేవి, సుహాసిని మొత్తం 125 మంది విద్యార్థిణీ, విద్యార్థులు పాల్గొన్నారు.ద

# మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని మర్యాదపూర్వకంగా కలిసిన ఉర్దూ అకాడమీ చైర్మన్ మహమ్మద్ ఫరూక్ షూబ్లీ.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో.

ఆంధ్రప్రదేశ్ ఉర్దూ అకాడమీ చైర్మన్ మహమ్మద్ ఫరూక్ షూబ్లీ శనివారం నంద్యాలలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఉర్దూ భాషా వికాసం మరియు ఉర్దూ అకాడమీ ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉర్దూ అకాడమీని మరింత బలోపేతం చేయడం, మైనార్టీ విద్యార్థులకు మెరుగైన శిక్షణ మరియు వసతులు కల్పించడంపై చర్చించారు. ఉర్దూ భాషా పరిరక్షణకు, భాషా పండితులను ప్రోత్సహించేందుకు చేపట్టాల్సిన చర్యల గురించి మంత్రి ఫరూక్ దిశానిర్దేశం చేశారు. రాబోయే రోజుల్లో అకాడమీ ద్వారా చేపట్టబోయే నూతన కార్యక్రమాలు, గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల అనంతరం అమలు చేయాల్సిన కార్యాచరణపై సమీక్షించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, మంత్రి ఎన్ఎండి ఫరూక్ సహకారంతో ఉర్దూ అకాడమీని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఈ సందర్భంగా చైర్మన్ మహమ్మద్ ఫరూక్ షూబ్లీ తెలిపారు.ఈ కార్యక్రమంలో నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాజ్, నంద్యాల ఇమాముల సంఘం అధ్యక్షులు అంజాద్ భాషా సిద్దికి తదితరులు పాల్గొన్నారు.

# మహానందీశ్వరుని సేవలో జస్టిస్ సుబ్బయ్య పూజలు

మహానంది, పల్లె వెలుగు



మహానంది పుణ్యక్షేత్రంలో మద్రాస్ రాష్ట్ర వినియోగదారుల పరిష్కార కమిషన్ చైర్మన్, జస్టిస్ ఆర్. సుబ్బయ్య పూజలు నిర్వహించారు. శనివారం వీరికి ఈవో ఎన్ .శ్రీనివాసరెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి అమ్మవార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. పూజల అనంతరం ఈవో శేష వస్త్రంతో సత్కరించి, స్వామి వారి జ్ఞాపికను అందజేయగా, వేద పండితులు వేద ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈవో మధు, మహానంది ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు









నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ :

నగరంలో రానున్న వేసవి కాలంలో ఎలాంటి తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన అశోక్‌నగర్‌లోని నీటి శుద్ధి కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. నీటి శుద్ధి ప్రక్రియలో ఉపయోగించే ఫెర్రిస్ ఆలమ్, లిక్విడ్ క్లోరిన్ గ్యాస్ సిలిండర్ల వినియోగంపై పూర్తి స్థాయి జాగ్రత్తలు పాటించాలని కమిషనర్ తెలిపారు. శుద్ధి కేంద్రంలోని ఎలక్ట్రికల్ మీటర్లు, స్కాబ్ యూనిట్‌ను పరిశీలించి, భద్రతా పరంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. స్టాక్ నిల్వ పట్టికలు, సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించి, ఎటువంటి లోపాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగర తాగునీటి సరఫరా వ్యవస్థపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని స్పష్టం చేశారు. లీకేజీలు, సరఫరా సమయం అంశాలపై పూర్తి స్థాయి పర్యవేక్షణ పెట్టాలని కమిషనర్ సూచించారు.సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో 0.15 టీఎంసీ, సుంకేసుల ప్రాజెక్టులో 1.2 టీఎంసీ నీటి నిల్వలపై ఎప్పటికప్పుడు జలవనరుల శాఖతో సమన్వయంతో ఉండాలని తెలిపారు. గాజులదిన్నె ప్రాజెక్టులో 1 టీఎంసీ నీటిని నిల్వ చేసుకునేలా జలవనరుల శాఖ అధికారులతో ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, ఎంఈ మనోహర్ రెడ్డి, డిఈఈ గిరిరాజ్, ఏఈ జనార్ధన్, ఇంచార్జి కేశవ్, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

# రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం







-కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్ ఐపియస్.

-డిఐజి , కర్నూలు ఇన్ చార్జ్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్.

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్

ప్రతి శనివారం రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్ ఐపియస్, డిఐజి , కర్నూలు ఇన్ చార్జ్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ లు ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సంధర్బంగా ఈ రోజు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా పోలీసుస్టేషన్ పరిధులలో జిల్లా పోలీసు అధికారులు ప్రజలకు రోడ్డు భద్రత , ట్రాఫిక్ నిబంధనల పై సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బైక్ లు నడిపే వారు ఖచ్చితంగా హెల్మెట్లు ధరించే విధంగా , ఓవర్ స్పీడ్ , ఓవర్ లోడ్ తో వాహనాలు వెళ్ళకుండా, డ్రంకెన్ డ్రైవ్ చేయరాదని తదితర



రోడ్డు భద్రత ప్రాముఖ్యతల పై ప్రజలకు అవగాహన కల్పించారు.

# ఎమ్మెర్వో కి వినతి పత్రం అందజేసిన గ్రామస్తులు

నందవరం పల్లె వెలుగు జనవరి 17

నందవరం మండలం కనకవీడు పేట గ్రామానికి చెందిన నిరుపేదల దశాబ్దాల కల ఇప్పటికీ నెరవేరకపోవడంపై నందవరం మండలం వైఎస్సార్‌సీపీ జాయింట్ సెక్రటరీ పేట శ్రీనివాస్ రెడ్డి ఎమ్మెర్వో దృష్టికి తీసుకెళ్లారు.కనకవీడుపేట గ్రామంలో 1999 భూ సేకరణ చేసి 2004 వ సంవత్సరంలోనే ప్రభుత్వం ఇళ్ల స్థలాల కోసం సర్వే నంబర్ 651/1లోని 10.70 ఎకరాల భూమిని సేకరించి, సుమారు 200 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 3 సెంట్ల చొప్పున పట్టాలు పంపిణీ చేసినప్పటికీ, నేటికీ ఆ స్థలాలు ఎక్కడ ఉన్నాయో లబ్ధిదారులకు తెలియని పరిస్థితి నెలకొంది. పట్టాలు చేతిలో ఉన్నప్పటికీ,క్షేత్రస్థాయిలో స్థలాన్ని చూపించకపోవడం హద్దులు నిర్ణయించకపోవడం



వల్ల లబ్ధిదారులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని పేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.అంతేకాక, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కనకవీడుపేట గ్రామంలో లబ్ధిదారులకు ఇవ్వాల్సిన 3 సెంట్ల స్థలాన్ని పూర్తిగా ఇవ్వకుండా, కూటమి నాయకులు 2 సెంట్లు మాత్రమే ఇచ్చి మిగిలిన స్థలాలను రూ.50,000లకు అమ్ముకునే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెర్వో దృష్టికి తీసుకెళ్లారు. ఇది పేదల హక్కులను హరించడమే కాకుండా ఘోరమైన అన్యాయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో వెంటనే స్పందించి,పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించి అర్హులైన లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్ల స్థలాలను అప్పగించాలని కనకవీడు పేట శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నందవరం మండల హెడ్ క్వార్టర్‌లో ఎమ్మెర్వో కి గ్రామస్తుల సమక్షంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కనకవీడుపేట గ్రామస్తులు రామన్న గౌడ్, ప్రభాకర్, నల్లన్న, నాగేష్, మునిస్వామి, వీరన్న, వెంకటేష్, దయగల వీరన్న తదితరులు పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

# ధాతృత్వం చాటుకున్న ఎస్ఎస్సి 97-98 బ్యాచ్

మిత్రుని కుటుంబానికి 60 వేల ఆర్థిక సహాయం.

కేసముద్రం, జనవరి 17(నంది పత్రిక):



కేసముద్రం స్టేషన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1997-98 పదవ తరగతి చదువుకున్న మిత్రులు తమ ధాతృత్వాన్ని చాటుకున్నారు. మున్సిపల్ పరిధిలోని అమీనాపురం గ్రామానికి చెందిన శెకిడి వెంకటేశ్వర్లు బతుకుదెరువు కోసం హైదరాబాదుకు పోయి కంప్రెషర్ ట్రాక్టర్ తో రంధ్రాలు వేసే క్రమంలో గోడకూలి మృతి చెందగా, అతని కుటుంబానికి శనివారం వెంకటేశ్వర్లు చిన్ననాటి మిత్రులు వెంకటేశ్వర్లు కుటుంబానికి అండగా ఉన్నామంటూ వెంకటేశ్వర్లు భార్య రాధిక పేరు మీద చేసిన రూ.60 వేల ఫిక్స్ బాండ్ ను వెంకటేశ్వర్లు భార్య రాధికకు అందజేశారు. తమ మిత్రుడు తమ నుండి దూరమైన అతని కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసానిచ్చారు. పిల్లల పైచదువుల కోసం సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు మిత్ర బృందం అధ్యక్షులు శాగంటి రాములు, కార్యదర్శి గడిపల్లి వెంకన్న, కోశాధికారి గొట్టం లక్ష్మణ్, ముఖ్యులు చిలువేరు సమ్మయ్య గౌడ్, గొట్టం సతీష్, కొండబోయిన కవిత, కొండబోయిన అశోక్, కొండబోయిన వేణు, జినుకల సునీత, సుక్క మేనక, కొండవీటి అశోక్, బొల్లెద్దు చందర్, కాసు యాకయ్య, నాగేల్లి దాసు, బానోత్ బాలాజీ, పులిగిల్ల కిరణ్, బండారు వీరబ్రహ్మం, అల్లి అశోక్, ఎండి అమీర్, కంచ కట్టయ్య, పబ్బతి సారంగం, కందుకూరి ఉపేందర్, మోడెం రాజు, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ నీలకంటేశ్వర స్వామి దేవస్థానము

## దుకాణాలకు ఒక్క రూపాయి కూడా పెంచలేదు

ఎమ్మిగనూరు పల్లె వెలుగు జనవరి 17

భక్తులకు, పుర ప్రజలకు,

గత 12 సంవత్సరాల నుండి తీరుబజార్లోని జాతర సమయంలో వెలిసే తాత్కాలిక దుకాణాలకు ఒక్క రూపాయి కూడా పెంచలేదు కేవలం గాజుల అంగడి వాళ్లు కోరగా స్వచ్ఛందంగా 3 సార్లు పెంచడం జరిగినది. మధ్య అంగళ్ళ వాళ్ళు ఇంతవరకు రూపాయి కూడా పెంచడానికి కూడా ఒప్పుకోలేదు.కరోనా మరియు వ్యాపారాలు లేవు అని సాకులు చెబుతున్నారు. పెంచుతామన్న వాళ్ళను కూడా పెంచుకోకుండా కొంతమంది అడ్డుపడుతూ పెంచలేదు.కానీ తేరు మేటిదారులైన ముత్తయిదు కొడుకులు, చిన్న భజంత్రీలు, పెద్ద భజంత్రీలు, వద్రంగి, కమ్మరి, కుమ్మరి ,వడ్డేవర్లు తేరు డెకరేషన్ కు, దేవాలయం కు రంగు వేయ వారు,విద్యుత్ అలంకరణ చేయు వారికి, మైక్ సెట్ వారికి, బారికెట్స్ ఏర్పాటు వారికి, తలారి, మొదలగు ఆయకట్టుదారులకు 12 సంవత్సరాలలో 4 సార్లు పెంచడం జరిగినది. కానీ ఆ భారాన్ని కూడా భరిస్తూ వస్తున్నాము. ఈ సంవత్సరము జాతర ఖర్చులు



స్వంతంగా దాదాపు 10 లక్షల వరకు మేము ఖర్చులకు మేటిదారులకు ఇవ్వడం జరిగినది. ఇప్పటివరకు మా సొంత డబ్బులను ఒక రూపాయి కూడా పొందలేదు. గత సంవత్సరము జాతర బాకీ 1,25,000 లోటుగా ఉంది. ఈ విధంగా 12 సంవత్సరాలుగా చాలా బాకీ ఉంది కానీ దాన్ని ఎవరిని అడగలేదు. ఈ సంవత్సరము మేటిదారులకు పెంచినందుకు మళ్లీ ఎక్కువ లోటు ఉంటుందని అంచనా వేసి మధ్య అంగళ్ళు వాళ్లని 2 సార్లు పిలవడం జరిగినది. వ్యాపారము రద్దీగా ఉందని రావడంలేదని తెలిపినారు. జాతర జరిగిన వారం రోజులకు చందాకు ఒక్క సారి వెళ్లి 5,25,300/ రసీదు తో తీసుకుని బ్యాంకులో జమ చేయడం జరిగినది. ఇంకా స్వీట్ స్టాల్ వాళ్లు, గాజుల వాళ్ళు లెక్కలు తీసుకుని బ్యాంకులో వేసిన తర్వాత మా అమౌంటును తీసుకోవడం జరుగుతుంది. ఈ విధంగా స్వామివారి జాతరను అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో కులమత ప్రసక్తి లేకుండా జరిపే జాతరను అప్రతిష్టపాలు చేయాలని కొంతమంది అవగాహన లేకుండా అపనిందలు వేస్తూ ధర్నాలు చేస్తూ నోరు పారేసుకుంటు ,కుర్ని కులస్తులైన మాలో మాకే విభేదాలు సృష్టిస్తూ మా కుర్నీ కులస్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారు, అవసరమైతే కుర్నీ దైవచార సంఘాన్ని కూడా మేము నడపగలము. ఇకపై ఎలాంటినిందా ఆరోపణలపై స్పందించము.రథోత్సవ సంఘము, కుర్ని బహుత్తమ దైవచార సంఘము,ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్స్, కుర్ని కుల బాంధవులు, మాచాని శివశంకర్, జగదీష్, శ్రీకాంత్ ,పవన్ కుమార్ ,మురళీధర్, హనుమేష్, హరి శేఖర్, శివకేశవ ,అనుప్రసాద్, హనుమేష్, ఎంవి వెంకటేశప్పరాజు, ఎంబి మహేష్, రాఘవేంద్ర,రవితేజ, డాక్టర్ మహేష్, మారుతి, చంద్రశేఖర్, శంకర్, సోమేశ్, వెంకటేష్ ,శ్యామ్, జగన్నాథ్, నాగరాజు, సత్యనారాయణ, ప్రసాద్, గడిగే డాక్టర్ బాబు, శ్రీకాంత్, ఉపేంద్ర, మోహన్, కామర్తి మిన్నప్ప, రాజశేఖర్, మోనె ముని రెడ్డి, రాము, కుమార్, ఖడ్గ వీరా, లోకప్ప, కె సత్య, నీలకంఠ, లక్ష్మయ్య, బండా సిద్ధప్ప, తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి చట్టంగానే ఉండాలి.

## సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివెస్ రాధాకృష్ణ

ఎమ్మిగనూరు పల్లె వెలుగు జనవరి 17

మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి చట్టంగానే ఉండాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివెస్ రాధాకృష్ణ, ఎండి అంజిబాబు పేర్కొన్నారు. శనివారం సిపిఎం పార్టీ ఎమ్మిగనూరు ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ సభ్యులు, సానుభూతి పరుల విస్తృత సమావేశం సుందరయ్య భవన్లో రాముడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి ఎస్ రాధాకృష్ణ, ఎండి. అంజిబాబు సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి గోవిందు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో వి బి జీరాంజీ బిల్లును పార్లమెంటులో ఆమోదించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి చట్టం వల్ల గ్రామీణ పేద ప్రజలు ఒక్క పూటైనా తిండి తింటున్నారని తెలిపారు. అటువంటి చట్టాన్ని మార్చి జి రామ్ జి బిల్లును తీసుకురావడాన్ని విమర్శించారు. 125 రోజులు పని కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వం అవాస్తవాలు చెబుతున్నదని అన్నారు. ఉపాధ్యాయ చట్టంలో గతంలో 100 రోజులు పని కల్పిస్తామని కేవలం 50 రోజులు మాత్రమే కేంద్ర ప్రభుత్వం పనులు కల్పించి ఉపాధి హామీ నిధులను కోత పెట్టిందని విమర్శించారు. రాష్ట్రాలకు గతంలో 10 శాతం నిధులు కేటాయించే వారిని ప్రస్తుతం రాష్ట్రాల వాటా 40 శాతానికి పెంచడానికి తీవ్రంగా వ్యతిరేకించారు. కావున మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి చట్టం యధాతధంగా అమలు చేస్తూ 125 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎండి అంజి బాబు గారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల 29 చట్టాలను కాల రాశి నాలుగు లేబర్ కోడ్లుగా అమలు చేయడం పెట్టుబడిదారుల అనుకూల విధానాలను కార్మికులపై బలంగా రుద్దడం తప్ప కార్మికులపై ఏమాత్రం ప్రేమ లేదని తెలిపారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కార్మికులకు 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచిందని, దీనిని కార్మికులు, ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కేంద్రం విధానాలను రాష్ట్ర కూటమి ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేస్తుంది అని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై కార్మికులు రైతులు మోయలేని భారాలను మోపడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల కమిషన్ను తన సొంత ప్రయోజనాలకు బిజెపి వాడుకుంటుందని ఆరోపించారు. 'సర్' పేరుతో దేశమంతటా లక్షలాది ఓటర్లను ప్రతి రాష్ట్రంలో ఓటర్ల జాబితా నుండి తొలగించడాన్ని తీవ్రంగా




ఖండించారు. తనకు వ్యతిరేకమైన రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం ఈడి, ఎన్ఐఏ, ఉప లాంటి చట్టాలను ఉపయోగించి ప్రభుత్వాలను లొంగదీసుకోవడాన్ని తప్పు పట్టారు. కేంద్ర రాష్ట్ర ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మికులు, రైతులు, ఉద్యోగస్తులు ప్రజల కోసం నిరంతరం సిపిఎం పార్టీ పోరాడుతుందని, జనవరి 18 నుండి 22 వరకు ఉపాధి చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ ఇంటింటి ప్రచారం చేపట్టిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు హనుమంతు, లక్ష్మీ నరసయ్య, రమేష్, సురేష్, సుభాన్, రాఘవరెడ్డి, అబ్దుల్లా, గోరె భాష, ఇస్మాయిల్, తిమ్మన్న, రాజా రమేష్, ఆంథోనీ పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి మేడారం పర్యటనను విజయవంతం చేయాలి

## మునినిపెల్లి కుమార్ గౌడ్ సర్పంచుల ఫోరం జిల్లా కన్వీనర్.

ములుగు జిల్లా బ్యూరో, జనవరి 17 పల్లె వెలుగు

తెలంగాణ రాష్ట్ర కుంభమేళాగాప్రసిద్ధిగాంచిన, ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారం మహా జాతర శాశ్వత అభివృద్ధి పనుల పునర్నిర్మాణ ప్రారంభోత్సవానికి విచ్చేయుచున్న మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ములుగు జిల్లా ఇంచర్ల గ్రామ సర్పంచ్ మరియు సర్పంచ్ ల ఫోరం జిల్లా కన్వీనర్ మునినిపెల్లి కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.గత పాలకుల చేతిలో నిర్లక్ష్యానికి గురైన మేడారం జాతరను నేడు కాంగ్రెస్ ప్రభుత్వం లో ముఖ్యమంత్రి సహకారంతో మంత్రి దనసరి అనసూయ సీతక్క నేడు మేడారం జాతరను అత్యంత అద్భుతంగా ఆబాల గోపాలం ఆశ్చర్యపోయి అబ్బుర పడే విధంగా మేడారం జాతరను చేస్తున్న అభివృద్ధి మనందరి కళ్ళ ముందు నేడు సాక్షాత్కరిస్తుంది.కోరుకున్న భక్తుల కోరికలను తీర్చే కొంగుబంగారం, కోట్లాది భక్తుల హృదయాల్లో కొలువైయున్న సమ్మక్క సారక్కలి ల జాతర గతంలో ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యానికి గురైన సంగతి ప్రజలందరికీ తెలుసు ఆయన గుర్తు చేశారు. అయితే నేడు స్వయానా ఆదివాసి బిడ్డ, సమ్మక్క సారలమ్మల నిజమైన వారసురాలు అయినటువంటి మన రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క ప్రత్యేక భక్తిశ్రద్ధలతో, చిత్తశుద్ధితో సమ్మక్క సారలక్క వనదేవతల పోరాట స్ఫూర్తి, ఉన్నతమైన చరిత్ర, ఘన కీర్తి ప్రపంచ నాలుగు దిశల వ్యాపించేల,మన దేశం యావత్ గర్వించేలా.మన ములుగు గడ్డ ఆడబిడ్డల వీర గాథ ప్రతిబింబించేలా నేడు మేడారంను అభివృద్ధి చేయుచున్న విధానం ఆజరామరం ,అనన్య సామాన్యం వారికి ములుగు జిల్లా ప్రజల తరఫున ప్రత్యేక హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు విధిగా ప్రజల్ని భారీ ఎత్తున రేపటి కార్యక్రమానికి తరలించి దిగ్విజయం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.పార్టీలకు అతీతంగా ములుగు గడ్డమీద పుట్టిన ప్రతి బిడ్డ సంతోషంతో, ఉత్సాహంతో పాల్గొనవలసిన ఆనందకర సందర్భం ఇది కావున మహిళలు, యువకులు, పెద్దలు, పిల్లలు ములుగు ప్రజలందరూ కింకర్తవ్యంగా భావించి ముఖ్యమంత్రి కి ఘన స్వాగతం పలికి మన కృతజ్ఞతలు తెలిపి కార్యక్రమం దిగ్విజయం చేయవలసిందిగా కోరుచున్నాను.



# మేడారంపై పోలీసుల డేగ కన్ను

## భద్రత విషయంలో ఎలాంటి రాజీ వద్దు.:మంత్రి సీతక్క.



ములుగు జిల్లా బ్యూరో, జనవరి 17 పల్లె వెలుగు



మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతర సందర్భంగా శాంతి భద్రతల ఏర్పాట్లపై రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనుసరి అనసూయ సీతక్క ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మేడారంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ను సందర్శించి, అక్కడి నుంచి కొనసాగుతున్న భద్రత ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు.జాతర ప్రాంతం అంతటా సుమారు 450 సీసీ కెమెరాల ద్వారా పోలీసులు కట్టుదిట్టమైన నిఘా కొనసాగిస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్లోని భారీ ఎల్ఈడీ స్క్రీన్పై జాతర ప్రాంగణంలో జరుగుతున్న కార్యక్రమాలు, భక్తుల రాకపోకలు, జనసాంద్రత పరిస్థితులను మంత్రి సీతక్క ప్రత్యక్షంగా వీక్షించారు.ఈ సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరిగితే పోలీసులు ఎలా స్పందిస్తారు, ముందస్తు చర్యలు, సన్నాహాలు ఏమిటన్న అంశాలను పోలీస్ అధికారులు మంత్రికి వివరించారు.భద్రత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, ప్రతి చిన్న అంశాన్ని కూడా అప్రమత్తతతో పర్యవేక్షించాలని మంత్రి సీతక్క పోలీస్ అధికారులకు స్పష్టంగా ఆదేశించారు. భక్తులు నిర్భయంగా, ప్రశాంతంగా జాతరలో పాల్గొనేలా భద్రతా ఏర్పాట్లు ఉండాలని, పోలీస్ యంత్రాంగం 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యమని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్., జిల్లా ఎస్పీ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పి ఓ చిత్ర మిశ్రా, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాలం మారింది..మీరూ మారాలి

పల్లె వెలుగు



డబ్బు ఖర్చు, నిర్వహణ, పొదుపు లాంటి విషయాలను ప్రధానంగా మన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆ తర్వాత బంధువులు, స్నేహితులు. ఆర్థిక విషయాల్లో అధిక భద్రత అభివృద్ధికి అవరోధంగా మారిందా..? మీ పెద్దల ఆర్థిక సలహాలు వారిని నష్టాల నుంచి రక్షించి ఉండవచ్చు. కానీ వేగంగా మారుతున్న పరిస్థితుల్లో అందులో కొన్ని మీ ఆర్థిక ప్రగతిని పరిమితం చేసే అవకాశం ఉంది. కాబట్టి, నాటి ఆర్థిక నియమాల్లో ఇప్పటికీ మీకు ఉపయోగ పడుతున్నవేంటి..? మీ పురోగతికి అడ్డుపడుతున్నవేంటి..? అని బేరీజు వేసుకోండి.డబ్బు ఖర్చు, నిర్వహణ, పొదుపు లాంటి విషయాలను ప్రధానంగా మన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆ తర్వాత బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషుల నుంచి నేర్చుకుంటుంటాం. సామాజిక ఆమోదంతో పాటు భద్రమైనవి కాబట్టి వారి సలహాలు, నియమాలనే మనమూ అనుసరిస్తుంటాం. కానీ, కాలంతో పాటు మన జీవనశైలితో సహా మార్కెట్లో పరిస్థితులు, ఆర్థిక అవసరాలూ వేగంగా మారుతూ వస్తున్నాయి. కాబట్టి, పొదుపు-పెట్టుబడులకు సంబంధించి నాటి ఆర్థిక నియమాలు నేడూ ఆచరణీయమా కాదా అని సమీక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మీ ఆర్థిక పురోగమనం, లక్ష్యాల సాధనకు అవరోధంగా మారిన నియమమైనా, సలహానైనా పక్కన పెట్టి.. నేటి కాలంలో ఉత్తమమైన ప్రత్యామ్నాయాన్ని ఎంచుకోవడంపై దృష్టి సారించండి. ప్రస్తుత తరం వారు సమీక్షించుకోవాల్సిన పెద్దల ఆర్థిక సలహాలు, నియమాల్లో కొన్ని మీకోసం..సొమ్ము భద్రంగా ఉండాలంటే ఫిక్స్డ్ డిపాజిట్ (ఎఫ్డీ) లేదా సేవింగ్ ఖాతాలో జమ చేయాలన్నది పెద్దలిచ్చే సలహా. ఇప్పటికీ వీటిల్లో జమ చేసిన సొమ్ముకు భద్రతకు ఢోకా లేదు. కానీ, ధరాఘాతం ప్రభావంతో వాటిల్లో దాచుకున్న డబ్బు విలువ పెరుగుదలకు అవకాశాలు పూర్తిగా సన్నగిల్లిపోయాయి. ఎందుకంటే, ఏటేటా ధరలు వేగంగా పెరుగుతూ పోతుండగా.. గడిచిన కొన్నేళ్లలో సేవింగ్ అకౌంట్ లేదా ఎఫ్డీపై బ్యాంక్లు చెల్లించే వార్షిక వడ్డీ గణనీయంగా తగ్గుతూ వచ్చింది. ప్రస్తుత ధరల వార్షిక పెరుగుదల 6-7 శాతంగా ఉండగా.. ఎఫ్డీపైనా బ్యాంక్లు కాలపరిమితి బట్టి గరిష్ఠంగా 7 శాతం వరకు (సీనియర్ సిటిజన్లు మినహాయించి) వడ్డీ చెల్లిస్తున్నాయి. ధరాఘాతం ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకున్నప్పుడు మీ ఎఫ్డీ సొమ్ము వృద్ధి దాదాపు సున్నా. నేటి కాలంలో సంపద పెరగాలంటే, పెట్టుబడికి భద్రతతో పాటు విలువ వృద్ధికీ సమ ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

పల్లె వెలుగు
తెలుగు జాతీయ దిన పత్రిక
అవినీతిపై నిఘా
GST No.37ACDFM5465G1Z1
RNI-APTEL/2012/46499
ఆదివారం 18-01-2026

# మినీ మేడారం జాతరలో వేలం పాటలు

-పాలకాయలు కొట్టి వేలంపాటలను ప్రారంభించిన సర్పంచులు



మొగుళ్ళపల్లి పల్లెవెలుగు ప్రతినిధి జనవరి 17

జయశంకర్ భూపాలపల్లి జిల్లా ముల్కలపల్లి-మొగుళ్లపల్లి గ్రామాల మధ్యన ఈనెల 28 నుంచి 31 వరకు అత్యంత వైభవంగా నిర్వహించబోయే వనదేవతలు శ్రీ సమ్మక్క-సారలమ్మ జాతర కమిటీలో శనివారం వేలం పాటలు నిర్వహించారు. ఇట్టి వేలం పాటలను మొగుళ్ళపల్లి సర్పంచ్ చాట్ల విజయ-రవీందర్, ముల్కలపల్లి సర్పంచ్ నాంపల్లి శ్రీవాణి- రమేష్ లు అమ్మవార్లకు పాలకాయలు కొట్టి వేలం పాటలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. శ్రీ సమ్మక్క-సారలమ్మ అమ్మవార్ల దీవెనలతో ప్రజలంతా సుఖసంతోషాలతో, కుటుంబ సభ్యులతో కలిసి కలకాలం నిండు నూరేళ్లు వర్ధిల్లాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జాతర కమిటీ ఉత్సవ ప్రధాన కార్యదర్శి చదువు అన్నారెడ్డి, దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారి వెంకటయ్య, ఉపాధ్యక్షులు మల్సాని నర్సింగారావు, బండారి భద్రయ్య, సంయుక్త కార్యదర్శులు వేముల మహేందర్ గౌడ్, కొడారి ఓదెలు, కోశాధికారులు నీల రాజు కురుమ, బండారి శ్రీనివాస్, జాతర ఉత్సవ కమిటీ మెంబర్లు చింతకింది నగేష్, బండారి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# నల్గొండను సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం: కోమటిరెడ్డి వెంకటరెడ్డి

-గత రెండేళ్లలో పట్టణాభివృద్ధికి రూ.2000 కోట్లు ఖర్చు
-అవసరమైతే మరిన్ని నిధులు తెచ్చేందుకు సిద్ధం
-కార్పొరేషన్ హోదాకు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు




నల్గొండ, జనవరి 17_పల్లె వెలుగు

నల్గొండను సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. గత రెండు సంవత్సరాల కాలంలో నల్గొండ పట్టణ అభివృద్ధికి సుమారు రూ.2000 కోట్లను ఖర్చు చేసినట్లు ఆయన వెల్లడించారు.పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. అవసరమైతే మరో రూ.2000 కోట్ల నిధులను కూడా తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, అభివృద్ధిలో ఎలాంటి రాజీ ఉండదని ఆయన పేర్కొన్నారు. నల్గొండ ప్రజల ఆకాంక్ష మేరకు కార్పొరేషన్ హోదా కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికు మంత్రి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో భాగంగా నల్గొండకు ఈ గౌరవం దక్కడం చారిత్రక ఘట్టమని వ్యాఖ్యానించారు. తనను ఆప్యాయంగా ఆదరించిన నల్గొండ ప్రజల కోసం ఎంత చేసినా తక్కువేనని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ప్రజల విశ్వాసానికి తగ్గట్టుగా పట్టణాన్ని హైదరాబాద్ తరహా అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

# వసతి సంక్షేమం

పల్లె వెలుగు

హాస్టళ్లలో స్నానపు గదులు, మరుగుదొడ్లు నిర్మించాలని నిర్ణయించింది. విద్యార్థుల కోసం దోమ తెరలను పంపిణీ చేయనుంది. వసతి సంక్షేమం.ఒంగోలు హాస్టల్‌లో ఆర్వోప్లాంట్ వద్ద నీరు పట్టుకుంటున్న విద్యార్థినులు. హాస్టల్ విద్యార్థులకు దోమతెరలు విడతల వారీగా పంపిణీకి సిద్ధం స్నానపు గదులు, మరుగుదొడ్ల నిర్మాణం. రూ.1.23 కోట్లు విడుదల ఇప్పటికే కొన్నింటిలో ఆర్వో ప్లాంట్లు మరికొన్ని చోట్ల ఏర్పాటుకు నిధులు(ఉమ్మడి జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్న విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించింది. హాస్టళ్లలో స్నానపు గదులు, మరుగుదొడ్లు నిర్మించాలని నిర్ణయించింది. విద్యార్థుల కోసం దోమ తెరలను పంపిణీ చేయనుంది. విడతల వారీగా అన్ని హాస్టళ్లకు వీటిని ఇవ్వనుంది. అందుకు సంబంధించిన నిధులను విడుదల చేసింది. ఇప్పటికే జిల్లాలోని 12 వసతి గృహాల్లో రక్షిత మంచినీటి ప్లాంట్లను ఏర్పాటు చేసింది. మరో తొమ్మిది చోట్ల మంజూరు చేసింది. అందుకు అనుగుణంగా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

# నయనానందం రామలింగేశ్వరుడి రథోత్సవం









## భక్తులతో కిక్కిరిసిన రాంపురం క్షేత్రం

మంత్రాలయం పల్లె వెలుగు జనవరి 17

మంత్రాలయం మండల పరిధిలోని రాంపురం గ్రామంలో వెలసిన శ్రీ రామలింగేశ్వర స్వామి మహా రథోత్సవం నయనానందికంగా సాగింది. ఆలయ ధర్మకర్తలు టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు వై. సీతారామిరెడ్డి , ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి , వైస్సార్సీపీ నేత వై. ప్రదీప్ రెడ్డి , వై. ధరణి రెడ్డి నేతృత్వంలో వేడుకలు అంగరంగా వైభవంగా జరిగాయి. ముందుగా ఉత్సవమూర్తి రామలింగేశ్వరుడికి గ్రామోత్సవం నిర్వహించి ధర్మకర్తల ఇంటి వరకు కడు వైభవంగా ఉత్సవమూర్తి ని ఊరేగించారు. అక్కడ స్వామి వారి కి ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులిచ్చి పల్లకిలో ఆలయం వరకు ఊరేగింపు గా తీసుకుని వచ్చారు.అనంతరం అర్చకులు వేదపఠనాలు గావిస్తూ మహా రథం పై కొలువుంచి యాత్ర కు అంకురార్పణ పలికారు. శివనామస్మరణ పఠిస్తూ భక్తులు రథం గొలుసులను చేతబూని రథాన్ని ముందుకు లాగారు. ఆలయం నుంచి 100 మీటర్లు మేర రథాన్ని లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు.. రథోత్సవ సమయంలో అరటి కాయ లు విసిరి మొక్కలు తీర్చుకున్నారు. వేలాదిగా భక్తులు కర్ణాటక, తెలుగు రాష్ట్రాల ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావడంతో రాంపురం క్షేత్రం రద్దీగా గా మారింది. జాతర లో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆదోని, పత్తికొండ, ఆలూరు,గుంతకల్లు, ఉరవకొండ, కర్నూలు నియోజకవర్గంలోని ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున తరలి వచ్చి టీటీడీ పాలకమండలి సభ్యులు వై. సీతారామిరెడ్డి కి, ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి కి, వైస్సార్సీపీ నేత వై. ప్రదీప్ రెడ్డి కి, వై. ధరణి రెడ్డి కి పూలమాలలు వేసి శాలువ కప్పి సన్మానించారు. హాజరైన ప్రముఖులు. శ్రీ రామలింగేశ్వర స్వామి జాతర మహోత్సవంను పురస్కరించుకుని రథోత్సవ కార్యక్రమానికి టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు వై. సీతారామిరెడ్డి , వైస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ. మోహన్ రెడ్డి , ఎమ్మెల్సీ వై. శివ రామిరెడ్డి , ఎమ్మెల్యే లు వై. బాలనాగిరెడ్డి , ప్రకాశం జిల్లా యర్ర గుండ పాలెం ఎమ్మెల్యే చంద్ర శేఖర్, మాజీ ఎమ్మెల్యే వై. సాయిప్రసాద్ రెడ్డి , వై. వెంకట్రామిరెడ్డి , వైస్సార్సీపీ నేత లు వై. ప్రదీప్ రెడ్డి అన్న , వై. ధరణి రెడ్డి , వై. మనోజ్ రెడ్డి , వై. భీమారెడ్డి , వై. కపిల్ రెడ్డి అన్న గారు, వై. నైరుతి రెడ్డి , రుద్రగౌడ్, చంద్ర శేఖర్, కురువ శశికళ, తెర్నేకల్ సురేంద్ర రెడ్డి జడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీ లు, సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, మాజీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామాల అనుబంధ విభాగాల నాయకులు, వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.60 మందితో బందోబస్తు శ్రీ రామలింగేశ్వర స్వామి జాతర మహోత్సవ సందర్భంగా మంత్రాలయం, కోసిగి సీఐలు రామంజులు, మంజునాథ్, ఎస్ఐ లు విజయ్ కుమార్, మల్లికార్జున, నిరంజన్ రెడ్డి, ,ఆధ్వర్యంలో 60 మంది సిబ్బంది తో బందోబస్తు నిర్వహించారు. 'గజ 'మెత్తిన అభిమానం. శ్రీ రామలింగేశ్వర స్వామి జాతర మహోత్సవ సందర్భంగా రాంపురం రెడ్డి సోదరుల పై ఉండే అభిమానం ను మంత్రాలయం మండలం సుంకేశ్వరి, రచ్చుమర్రి గ్రామంలోని ప్రజా ప్రతినిధులు, వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, రాంపురం రెడ్డి సోదరుల అభిమానులు తేరు బజార్ లో సుంకేశ్వరి గ్రామస్థులు, శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం వద్ద రచ్చుమర్రి గ్రామస్థులు గజ మాలతో సన్మానం చేసి అభిమానం చాటుకున్నారు. బి ఆకర్షణ గా నిలిచిన కటౌట్. శ్రీ రామలింగేశ్వర స్వామి జాతర మహోత్సవ సందర్భంగా బూదూరు గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకులు జక్కయ్య, సూగూరు గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకులు చిట్టి బాబు వైఎస్సార్సీపీ నేత వై. ప్రదీప్ రెడ్డి కట్అవుట్ ను ఏర్పాటు చేసి తన అభిమానం చాటుకున్నారు. బృందం గజమాలతో సన్మానం చేసి సత్కరించి అభిమానం చాటుకున్నారు. ఉప్పొంగిన అభిమానం బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పేదల పెన్నిధి, అన్న అంటే నేను ఉన్న అంటు భరోసా ఇచ్చే మహానుభావులు రాంపురం రెడ్డి సోదరులు, వై. ధరణి రెడ్డి తో పాటు వై. ప్రదీప్ రెడ్డి కి అభిమానం ఉప్పొంగిది. మంత్రాలయం నియోజకవర్గం తో పాటు ఎమ్మిగనూరు నియోజకవర్గం లోని అన్ని గ్రామాల నుంచి అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు శ్రీ రామలింగేశ్వర స్వామి జాతర మహోత్సవ సందర్భంగా రాంపురం గ్రామంలో పలు గ్రామాలకు చెందిన వారు నిర్వహించిన కోలాటాలు, డ్రమ్స్ దరవుల మధ్య చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

# సికింద్రాబాద్ అస్తిత్వాన్ని చెరిపే ప్రయత్నం తగదు: కేటీఆర్

-తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రెస్‌మీట్
-ప్రభుత్వ నిర్ణయాలను తుగ్లక్ పాలనతో పోల్చిన వ్యాఖ్యలు
-శాంతియుత పోరాటాన్ని అణిచివేస్తున్నారని విమర్శ



హైదరాబాద్, జనవరి 17 పల్లె వెలుగు

తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. చారిత్రకంగా హైదరాబాద్‌సికింద్రాబాద్ జంట నగరాలుగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయని, అలాంటి నగరాల అస్తిత్వాన్ని చెరిపివేసేలా ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ తెలంగాణ ప్రజల అస్తిత్వానికి ప్రతీకగా నిలిచిందని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను తుగ్లక్ పాలనతో పోలుస్తూ, ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చి హామీల అమలును పక్కనపెట్టి పేర్లు, గుర్తులు మార్చడంపైనే ప్రభుత్వం దృష్టి పెట్టిందని విమర్శించారు. టీఎస్ పేరును టీజీగా మార్చడం, తెలంగాణ తల్లి రూపాన్ని మార్చడం, అధికార చిహ్నాల నుంచి చారిత్రక గుర్తులను తొలగించడం వల్ల ప్రజలకు ఏం లాభమో ప్రభుత్వం చెప్పాలని ప్రశ్నించారు.గతంలో వికేంద్రీకరణ విధానంతో కొత్త గ్రామాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాలను ఏర్పాటు చేసి పాలనను ప్రజల దగ్గరకు తీసుకువచ్చిన దృష్టిని గుర్తు చేస్తూ, హైదరాబాద్‌లో కూడా వార్డులు, జోన్లు పెంచి అభివృద్ధి నిధులు ఇచ్చామని కేటీఆర్ తెలిపారు. అయితే ప్రస్తుతం రెండు సంవత్సరాలుగా హైదరాబాద్‌లో ఒక్క ఇటుక కూడా పెట్టలేదని, రోడ్డు వేయలేదని, ఇల్లు కట్టలేదని ఆరోపించారు. సికింద్రాబాద్ అస్తిత్వాన్ని కాపాడాలని ప్రజలు శాంతియుత ర్యాలీ చేపట్టినప్పటికీ అనుమతులు రద్దు చేసి వేలాది మందిని అరెస్టు చేయడం అరాచకమని విమర్శించారు. అరెస్టు చేసిన వారిని వెంటనే భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధంగా నిరసన తెలిపే హక్కును వినియోగించుకుంటూ కోర్టును ఆశ్రయించి పోరాటం కొనసాగిస్తామని, తిరిగి తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత సికింద్రాబాద్‌ను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేసి ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# మున్సిపాలిటీ వార్డుల రిజర్వేషన్ పారదర్శకంగా నిర్వహించాము :కలెక్టర్

సూర్యాపేట కలెక్టరేట్ జనవరి 17 పల్లె వెలుగు



మున్సిపాలిటీ వార్డుల రిజర్వేషన్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.జిల్లా సమీకృత కార్యాలయ సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో సూర్యాపేట, కోదాడ,హుజూర్నగర్,నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటీల పరిధిలోని 141 వార్డులకు ఆయన రిజర్వేషన్ ప్రక్రియను శనివారం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వార్డుల వారీగా రిజర్వేషన్లు కేటాయించామని గత ఎన్నికల రిజర్వేషన్ , ఎస్ టి, ఎస్ సి, బి సి జనాభా లెక్కలు, రొటేషన్ విధానం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా రాజకీయ పార్టీ ప్రతినిధుల మధ్య రిజర్వేషన్లను పారదర్శకంగా ప్రకటించటం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ కే సీతారామారావు,మున్సిపల్ కమిషనర్లు హన్మంతరెడ్డి, రమాదేవి, శ్రీనివాస్ రెడ్డి, ఆశోక్ రెడ్డి, మున్వర్ అలీ , రాజకీయ పార్టీ ప్రతినిధులు,అధికారులు, సిబ్బంది,హాజరయ్యారు.

ఆదివారం 18-01-2026

పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499



# సమ్మక్కసారలమ్మ మహా జాతర కు ప్రభుత్వ యంత్రాంగం భారీ ఏర్పాట్లు





**-తుది దశకు చేరుకున్న ఏర్పాట్లు.**

**క్షేత్ర స్థాయిలోనే ఉండి, ప్రతి విభాగం పనితీరును సమీక్షిస్తున్న అధికార యంత్రాంగం.**

ములుగు జిల్లా బ్యూరో జనవరి 17 పల్లె వెలుగు

మేడారం సమ్మక్కసారలమ్మ మహాజాతర2026కు తెలంగాణ ప్రభుత్వం భారీ స్థాయిలో ఏర్పాట్లు చేపట్టింది. కోట్లాది భక్తులు తల్లుల దర్శనానికి వచ్చే ఈ మహా పర్వంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకుంటోంది. ఈ ఏర్పాట్లన్నింటిపై నిత్యం ప్రత్యక్ష పర్యవేక్షణ చేయడానికి రాష్ట్ర మంత్రులు, అధికార యంత్రాంగం మేడారంలోనే బస చేస్తూ, క్షేత్రస్థాయిలో ప్రతి అంశాన్ని పరిశీలిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం, సుభిక్ష దర్శనం ప్రథమ ప్రాధాన్యతగా మారింది. ఈ సారి సుమారు మూడు కోట్ల మంది భక్తులు వస్తారనే అంచనాతో, ఎక్కడా ఇబ్బందులు లేకుండా అన్ని శాఖలు కలిసి సమగ్ర ప్రణాళికతో పని చేసేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఈ జాతర కోసం మొత్తం 21 శాఖలకు చెందిన 42,027 మంది అధికారులు, సిబ్బంది, మేడారం పరిసర ప్రాంతాల్లో విధులు నిర్వహించనున్నారు. వీరికి అదనంగా 2 వేల మంది ఆదివాసీ యువత వాలంటీర్లుగా తమ సేవలు అందించనున్నారు. మోబైల్ నెట్ వర్క్ కి ఎలాంటి అంతరాయం కలగకుండా 27 శాశ్వత టవర్లతో పాటు తాత్కాలిక పద్దతిలో 33 మోబైల్ టవర్లను, 450 వెరీ హై ఫ్రీక్వెన్సీ సెట్లను ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీని క్రమబద్ధంగానియంత్రించేందుకు మేడారం ప్రాంతాన్ని 8 పరిపాలనా జోన్లుగా, 42 సెక్టర్లుగా విభజించారు. ఒక్కో జోన్ కు జిల్లా స్థాయి అధికారి ఇంచార్జ్ గా వ్యవహరిస్తారు. ఒక్కో సెక్టార్ కు మండల స్థాయి అధికారి భాధ్యతలు నిర్వర్తిస్తారు. ఆలయ ప్రాంగణం, గద్దెలు, జంపన్నవాగు, ఆర్టీసీ బస్టాండ్, ఊరట్టం, శివరాం సాగర్, నర్లాపూర్, పడిగాపూర్ వంటి అన్ని కీలక ప్రాంతాల్లో కంట్రోల్ రూములు, మిస్సింగ్ పర్సన్స్ క్యాంపులు, అత్యవసర స్పందన బృందాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. భక్తుల రాకపోకల్లో ఇబ్బందులు రాకుండా మొత్తం 525 చోట్ల రహదారి సమస్యలను గుర్తించి పరిష్కరించారు. జాతరకు ఉపయోగపడే కొత్త రోడ్లు, మరమ్మత్తులు, కల్వర్టులతో రవాణా వ్యవస్థను బలోపేతం చేశారు. వాహనాల రద్దీ తగ్గించేందుకు అటవీ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో మొత్తం 1,418 ఎకరాల విస్తీర్ణంలో 42 పార్కింగ్ ప్రాంతాలు సిద్ధం చేశారు.తాగునీటి సమస్య తలెత్తకుండా మిషన్ భగీరథ ద్వారా నిరంతం తాగు నీటి సరఫరా జరిగేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం 5,482 తాగు నీటి నల్లాలు ఏర్పాటు చేసి భక్తులకు శుద్ధమైన నీటిని అందిస్తున్నారు.జంపన్నవాగులో పవిత్ర స్నానాలు చేసే భక్తుల కోస 119 డ్రెస్సింగ్ రూములు ఏర్పాటు చేయడంతో పాటు నీటి పరిశుభ్రత కోసం ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయనున్నారు. 285 బ్లాకుల్లో 5700 టాయిలెట్లను సిద్దం చేశారు. వీటికి అధనంగా మోబైల్ టాయిలెట్స్ ను అందుబాటులోకి తేనున్నారు. పారిశుధ్య నిర్వహణ కోసం 5 వేల మంది సిబ్బందిని, 150 ట్యాంకర్లు, 100 ట్రాక్టర్లు, 18 స్వీపింగ్ మిషిన్లు, 12 జేసీబీ, 40 స్వచ్ఛ ఆటోలు, 16 డోజర్లను రంగంలోకి దింపారు. జాతర ప్రాంతంలో విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా టీజీఎన్పీడీసీఎల్ ద్వారా 196 ట్రాన్స్ఫార్మర్లు, 911 విద్యుత్ స్తంభాలు, 65.75 కిలోమీటర్ల విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ అంతరాయం తలెత్తకుండా 350 మంది సిబ్బందిని నియమించారు. ఆలయాలు, ప్రధాన మార్గాలు, పార్కింగ్ ప్రాంతాల్లో వేల సంఖ్యలో హై పవర్ లైట్లు వెలుగులు పంచుతుండగా, అత్యవసర పరిస్థితుల కోసం 28 డీజిల్ జనరేటర్లు బ్యాకప్‌గా సిద్ధంగా ఉన్నాయి. భక్తులు సులభంగా మేడారానికి చేరుకునేందుకు టీజీఆర్టీసీ ఈసారి 4000 బస్సులను వినియోగంలోకి తెచ్చి 51,000 ట్రిప్పులు నిర్వహిస్తోంది. ప్రత్యేక బస్టాండ్లు, ప్రత్యేక రూట్లతో రవాణా వ్యవస్థను మరింత సమర్థంగా నిర్వహిస్తున్నారు. జాతర కోసం 10441 మంది ఆర్టీసీ సిబ్బంది.సేవలందించనున్నారు. గంటకు 15 బస్సులు ప్రయాణించేలా ప్లాన్ చేస్తున్నారు. జాతర సమయంలో ఆరోగ్య సేవల కోసం మొత్తం 5,192 మంది వైద్య సిబ్బందిని నియమించారు. భక్తులకు సేవలందించేందుకు 30 అంబులెన్సులు, 40 బైక్ అంబులెన్సులు, 50 పడకల ప్రధాన ఆసుపత్రి, రోజుకు 30 మెడికల్ క్యాంపులు పనిచేస్తాయి. జంపన్నవాగులో ప్రమాదాలను నివారించేందుకు 210 మంది గజ ఈతగాళ్లు, 12 మంది సింగరేణి రెస్క్యూ సిబ్బంది, 100 ాణ=ఖీ బృందాలు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. అగ్నిప్రమాదాలను ఎదుర్కొనేందుకు 15 ఫైర్ బ్రిగేడ్ వాహనాలు, 268 మంది ఫైర్ ఫైటర్లు సిద్ధంగా ఉన్నారు.అటవీ శాఖ ద్వారా పార్కింగ్, రోడ్లతో పాటు పర్యావరణ సంరక్షణ చేపడుతుండగా, ఐటిడీఏ ఆధ్వర్యంలో గిరిజనులకు కొబ్బరి కాయ, బెల్లం, ఇతర వ్యాపారాల కోసం లైసెన్సులు ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నారు. మొత్తంగా మేడారంమహాజాతర2026ను ప్రపంచ స్థాయిలో నిర్వహించాలనే లక్ష్యంతో, అన్ని శాఖల సమన్వయంతో భక్తులకు త్వరితగతిన తల్లుల దర్శనం, సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోంది.

**అత్యాధునిక వసతులతో మీడియా సెంటర్**

మేడారం మహా జాతర విశేషాలను దేశ విదేశీ భక్తులకు అనుక్షణం, ఎప్పటికప్పుడు అందించుటకు ప్రింట్, ఎలక్ట్రానిక్, ఇతర ప్రచార, ప్రసార మాద్యమాల సౌకర్యార్థం రాష్ట సమాచార పౌర సంబందాల శాఖచే అమ్మవార్ల గద్దెల పక్కన ఉన్న టీటీడీ కళ్యాణ మండపంలో జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా మీడియా సెంటర్ ఏర్పాటు చేయనైనది. ఇక్కడ మీడియా సెంటర్ నుండి, ఫోటోలు, వీడియోలు మరియు వార్తలు నేరుగా పంపించుకొనే ఏర్పాటు చేయడం జరిగింది.

**మేడారం మీడియా సెంటర్ లో కల్పించిన వసతులు**

-100+100 ఎజూఎం సామర్ధ్యం కలిగిన ఇంటర్నెట్ సదుపాయం. 20 హై కన్ఫిగేషన్ కృశీపూటర్లు.జిరాక్స్ మిషన్. పాక్స్, ప్రింటర్లు.ల్యాండ్ ఫోన్ సౌకర్యంతో పాలు, బోజన వసతి కూడా కల్పించనున్నారు.

# దేశ రక్షణలో చనిపోయేవారి కంటే రోడ్డు ప్రమాదాల్లో మరణించే వారే ఎక్కువ : ఎస్పీ కె నరసింహ

**-జాగ్రత్తగా వాహనాలు నడపాలి.**

**-అతివేగం, అజాగ్రత్త వల్ల అధిక ప్రమాదాలు.**



సూర్యాపేట జనవరి 17 పల్లె వెలుగు

రోడ్డు ప్రమాదాలు నివారించి ప్రతిఒక్కరూ సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకోవలనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర పోలీసులు ల ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమం మహా ఉద్యమంగా నిర్వహిస్తున్నామని ఎస్పీ నరసింహ తెలిపినారు. ఆర్టీసీ డ్రైవర్లకు, లారీ అసోసియేషన్ , టాక్సీ డ్రైవర్లకు, అంజనాపురి జంక్షన్, అంబేద్కర్ కాలనీ జంక్షన్ వినియోగదారులకు ఆర్టీసీ డిపో కార్యాలయం నందు నిర్వహించిన రోడ్డు భద్రత, అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమానికి ఎస్పీ నరసింహ హాజరై మాట్లాడారు. జీవితం చాలా విలువైనది, జీవనానికి మరణానికి సార్ధకత ఉండాలి భారతదేశంలో దేశ రక్షణలో మరణించే వారికంటే రోడ్డు ప్రమాదాల బారిన మరణించే వారి సంఖ్య అధికంగా ఉంటుంది అన్నారు. రోడ్డు ప్రమాదాల బారిన పడి అర్ధంతరంగా మరణిస్తే కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి, తల్లిదండ్రులకు తోబుట్టువులు దుఃఖాన్ని మిగులుస్తున్నారు అన్నారు. అర్వపల్లి వద్ద జరిగిన కారు ప్రమాదాన్ని గుర్తు చేశారు, విధుల నిర్వహణలో పోలీసు సోదరులు రోడ్డు ప్రమాదాల బారినపడి చనిపోయిన సందర్భాలు గుర్తు చేశారు. ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారానే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చు అన్నారు. ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చడంలో వాహన డ్రైవర్ల పాత్ర కీలకంగా వుంటుందని తెలిపారు. రహదారి ప్రమాదాల నివారణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మంగా చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమములో పౌరులు, ప్రజలు, వాహనదారులు, విద్యార్థులు భాగస్వామ్యం కావాలి అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకై తీసుకోవాల్సిన ముందస్తూ జాగ్రత్త చర్యలతో పాటు పాటించాల్సిన ట్రాఫిక్ నిబంధనలు, డ్రైవింగ్ సమయంలో డ్రైవర్లు చేయకూడని పనులపై ట్రాఫిక్ పోలీస్ అధికారులు ఆర్టీసీ ఉద్యోగులకు వివరించారు. దేశంలో ప్రస్తుతం రోడ్డు ప్రమాదాలు పెద్ద సమస్యగా మారిందని, దీని కారణంతో ఎంతోమంది రోడ్డు ప్రమాదాల్లో అకాల మరణం పొందటం కారణంగా కొన్ని కుటుంబాలు రోడ్డున పడ్డాయని అన్నారు. నేటి యువత చెడు అలవాట్లు గురై బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారు అన్నారు. నిత్యం ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్ గా గుర్తించి నివారణ చర్యలు తీసుకుంటున్నాం అని తెలిపారు. రోడ్లపై సూచిక బోర్డులను అనుసరించాలి, వాహన సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దు, అతివేగంగా వెళ్ళవద్దు, తప్పుడు మార్గంలో వాహనాలు నడపవద్దు, మద్యం మత్తులో వాహనాలు నడపవద్దు అని కోరారు. రోడ్డు ప్రమాదాలు దుఃఖం మిగిల్చాయి అని భావోద్వేగం ఐన రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలు. రోడ్డు ప్రమాదాలు జరిగి తోబుట్టువులని కుటుంబ పెద్దలను కోల్పోయిన వారు మాట్లాడుతూ చాలా ఇబ్బందులు పడుతున్నామని రోడ్డు ప్రమాదాల వల్ల మేము నష్టపోయామని భావోద్వేగానికి గురయ్యారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట డివిజన్ డిఎస్పి ప్రసన్నకుమార్, ఆర్టీసీ డిపో మేనేజర్ సునీత, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు, ఆర్థోపెడిక్ డాక్టర్ కార్తీక్, ఎస్సైలు సాయిరాం ఏడుకొండలు మహేందర్ పాల్గొన్నారు.

# టిఆర్పి కార్యాలయం లో ఘనంగా తీన్మార్ మల్లన్న జన్మదిన వేడుకలు

**రక్తదానం చేసిన టిఆర్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్**



సూర్యాపేట జనవరి 17 పల్లె వెలుగు

బహుజనులకు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఏర్పడిందని టిఆర్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్ అన్నారు. శనివారం టిఆర్పి రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్న జన్మదినం సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని టీఆర్పీ కార్యాలయంలో తీన్మార్ మల్లన్న జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో వట్టె జానయ్య యాదవ్ పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్ మాట్లాడుతూ బహు జనుల కు రాజ్యాధికారం సాధించటం కోసమే టిఆర్పి ఏర్పడిందని చెప్పారు. సర్పంచ్ ఎన్నికల్లో జనరల్ స్థానాలలో కూడా బీసీలు పొటిచేసి ఘన విజయం సాధించారని, అలాగే ఈసారి మున్సిపల్ ఎన్నికల్లో కూడా బీసీలు జనరల్ స్థానంలో పోటీ చేసి విజయం సాధించాలని అన్నారు. ఎమ్మెల్సి తీన్మార్ మల్లన్న అనేక ప్రజా సమస్యలపై ఉద్యోగుల సమస్యలపై విద్యార్థుల సమస్యలపై శాసనమండలి లో నిరంతరము ప్రశ్నిస్తున్నారని బహుజనులకు అండగా నిలుస్తున్నారని ఆయన అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను సాధించుకోవడానికి అందరం ఐకమత్యంగా పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిఆర్పి జిల్లా అధ్యక్షుడు మామిడి అంజయ్య, రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ నీరజ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మీర్ అక్బర్, పట్టణ అధ్యక్షులు కుంభం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర గవర్నర్ జిల్లా పర్యటన సందర్భంగా ఏర్పాట్లు పరిశీలించిన :కలెక్టర్

హుజూర్ నగర్ జనవరి 17 పల్లె వెలుగు



త్వరలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సూర్యాపేట జిల్లా హుజుర్ నగర్ మండలం లోని ముగ్ధమ్ నగర్ లో అగ్రికల్చర్ కాలేజీ కీ శంకుస్థాపన చేయు ప్రదేశాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో రాష్ట్ర గవర్నర్ జిష్ణ దేవ్ వర్మ ముగ్దమ్ నగర్ లో 126.కోట్ల రూపాయలతో 100 ఎకరాలలో నిర్మించనున్న అగ్రికల్చర్ కాలేజికీ శంకుస్థాపన చేయు శిలాఫలకం ప్రదేశాన్ని పరిశీలించి చదును చేసి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. తదుపరి రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సూర్యాపేట జిల్లా,మఠం పల్లి మండలం,మట్టపల్లి లక్ష్మీ నరసింహ స్వామి దర్శనార్థం మట్టపల్లి పుణ్యక్షేత్రానికి రానున్నందున రాష్ట్ర గవర్నర్ పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్ పి కె నరసింహ తో కలిసి మట్టపల్లి లో గవర్నర్ రాక ఏర్పాట్ల పై అధికారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్ర గవర్నర్ పర్యటనకు తగిన ఏర్పాట్లు చేయాలని దేవస్థానాన్ని పూలతో అందంగా అలంకరించాలని, గవర్నర్ దంపతులు గర్భగుడిలో పూజలు చేయుటకు తగిన ఏర్పాటు చేయాలని దేవాదాయ శాఖ అధికారులను, ధర్మకర్తలను ఆదేశించారు. మట్టపల్లి గ్రామపంచాయతీ పరిధిలో రోడ్లు, కాలువలు, నది పరివాహక ప్రాంతం పరిశుభ్రంగా ఉంచాలని, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించాలని, రోడ్ల పై ఎక్కడైనా గుంతలు లేకుండా వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని, అవసరం ఉన్న చోట అప్రోచ్ రోడ్లు నిర్మించాలని, తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని, అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండాలని, విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, ప్రత్యేక వైద్యులు అందుబాటులో ఉండడమే కాకుండా, అత్యవసర మందులు,అంబులెన్స్ ఏర్పాటు చేయాలని, గవర్నరు విశ్రాంతి తీసుకొనుటగాను గెస్ట్ హౌస్ శుభ్రం చేసి సిద్ధంగా ఉంచాలని, గ్రీన్ కార్పెట్లు, రెడ్ కార్పెట్లు పరవాలని, పూల మొక్కలతో దేవాలయాన్ని అందంగా అలంకరించాలని ఆదేశించారు. పోలీస్ శాఖ హెలి ప్యాడ్, పార్కింగ్, ట్రాఫిక్,బందోబస్తు చూసుకోవాలని అలాగే వ్యవసాయ శాఖ, డి ఆర్ డి ఏ తదితర శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేయాలని, ఆదేశించారు. చివరిగా కలెక్టర్, ఎస్ పి లకు వేదపండితులు వేద ఆశీర్వచనం ఇచ్చి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమం లో కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, తాసిల్దారులు కవిత,మంగా, డీఈవో శ్రీధర్ రెడ్డి, ఇంచార్జ డి ఆర్ డి ఏ పి డి శిరీష, ఆర్ &బి, డి ఇ సీతారామయ్య, జిల్లా వైద్య అధికారి, డి పి ఓ యాదగిరి డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, అనువంశిక ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు,విజయ్ కుమార్, ఈవో జ్యోతి, జిల్లా అధికారులు, తదితరులు హాజరయ్యారు.

పల్లె వెలుగు
తెలుగు జాతీయ దిన పత్రిక
అవినీతిపై నిఘా
RNI-APTEL/2012/46499
GST No.37ACDFM5465G1Z1
ఆదివారం 18-01-2026

# సంగారెడ్డిలో ఎమ్మెల్యేగా ఇకపై పోటీ చేయను: జగ్గారెడ్డి

-కాంగ్రెస్ సీనియర్ నేత హాట్ కామెంట్స్
-రాహుల్ గాంధీ ప్రచారం చేసినా ఓటమి బాధ
-సంగారెడ్డిలో ఇక ప్రచారం చేయనని స్పష్టం



సంగారెడ్డి, జనవరి 17 పల్లె వెలుగు,
సంగారెడ్డిలో ఇకపై తాను ఎమ్మెల్యేగా పోటీ చేయనని కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తన రాజకీయ జీవితంలో సంగారెడ్డి అంశం మరిచిపోలేని అనుభవంగా మిగిలిపోయిందని ఆయన అన్నారు.ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ, తన కోసం రాహుల్ గాంధీ స్వయంగా సంగారెడ్డికి వచ్చి ప్రచారం చేసినప్పటికీ తనను అక్కడి ప్రజలు ఓడించారని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ భుజంపై చేయి వేసి తనను గెలిపించాలని కోరినా ఫలితం రాలేదని చెప్పారు. రాహుల్ గాంధీని సంగారెడ్డికి పిలిచి అవమానించినట్టే అయ్యానేమోనని కూడా తాను ఫీల్ అయ్యానని తెలిపారు.తన ఓటమికి కారణం పేద ప్రజలు కాదని, ఇక్కడి మేధావులు, పెద్దలే కారణమని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. ఈ ఓటమి తన జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేనిదని స్పష్టం చేశారు.భవిష్యత్తులో సంగారెడ్డిలో తన భార్య నిర్మలా పోటీ చేసినా తాను ప్రచారానికి రానని జగ్గారెడ్డి తేల్చి చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడికైనా వెళ్లి ప్రచారం చేస్తానని, కానీ సంగారెడ్డిలో మాత్రం ఇకపై ప్రచారం చేయనని ఆయన స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్‌లోకి చేరికలు

మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో చేరికలు



కొడంగల్, జనవరి 17 పల్లె వెలుగు,
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో, కొడంగల్ మాజీ శాసనసభ్యులు పట్నం నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలం నుంచి సుమారు 150 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు.పార్టీలోకి చేరిన వారికి కేటీఆర్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ విధానాలు, నాయకత్వం పట్ల విశ్వాసంతోనే ప్రజలు పార్టీలోకి వస్తున్నారని పేర్కొన్నారు.కొడంగల్‌లో బీఆర్ఎస్ బలపడుతుండటం, కాంగ్రెస్ నుంచి వరుసగా చేరికలు జరుగుతుండటంతో రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది. రానున్న రోజుల్లో మరిన్ని చేరికలు ఉంటాయని పార్టీ నేతలు తెలిపారు.

# తిరుగు ప్రయాణంలోనూ తిప్పలు!

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 17



సంక్రాంతి ప్రభావంతో రవాణా వ్యవస్థలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది.పండుగకు సొంతర్లకు వచ్చి ఆనందంగా గడిపి ఉద్యోగ, ఉపాధి, చదువుల నిమిత్తం తిరిగి నగరాలకు వెళ్లేందుకు సిద్ధమైన వారికి ప్రయాణ కష్టాలు ఎదురవుతున్నాయి.ఒంగోలులో ఆర్టీసీ బస్సు ఎక్కేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు.కిటకిటలాడుతున్న బస్సులు, రైళ్లు.దూరప్రాంతాల వారికి ప్రయాణ కష్టాలు. సంక్రాంతి ప్రభావంతో రవాణా వ్యవస్థలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది.పండుగకు సొంతర్లకు వచ్చి ఆనందంగా గడిపి ఉద్యోగ, ఉపాధి, చదువుల నిమిత్తం తిరిగి నగరాలకు వెళ్లేందుకు సిద్ధమైన వారికి ప్రయాణ కష్టాలు ఎదురవుతున్నాయి. రైళ్లు, ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు రవాణా సౌకర్యాలన్నింటిలో రిజర్వేషన్ నిల్... బోర్డులు దర్శనమిస్తున్నాయి. పిల్లా పాపలతో ప్రయాణం చేయాల్సి ఉండటంతో రిజర్వేషన్‌ల కోసం పాట్లు పడినా ఆదివారం వరకు లభించే పరిస్థితి లేదు.

# మితవాద ప్రభుత్వాలు 'పనిహక్కు'ను ఎందుకు వ్యతిరేకిస్తాయి

**సంజయ్ రాయ్**

పల్లె వెలుగు, దిన పత్రిక:



ప్రపంచంలోనే అతిపెద్ద డిమాండ్ ఆధారిత ఉపాధి హామీ చట్టాన్ని (మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టం) రద్దు చెయ్యడం అంటే శ్రమను గౌరవిస్తూ రాజ్యం హక్కుగా కల్పించిన సంక్షేమాన్ని నీరుగార్చి, భూస్వామ్యం దయమీద ఆధారపడిన నిరంకుశ, వివక్షతకు తావిచ్చే మితవాద సంక్షేమ పథకాన్ని రుద్దడమే. మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన 'విబిజి రామ్ జి' పథకం (వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్-(గ్రామీణ్) మరోసారి గ్రామీణ పేదలను 'పైవాడి' దయకు వదిలేసింది. 'ఉపాధి హక్కు' ప్రజాస్వామికంగా పేదలకు లభించిన హక్కుగా వారికి సాధికారత కల్పించడంతో పాటు భూస్వామ్య వర్గాలతో వాని బేరసారాల శక్తిని ఇనుమడింప చేసింది. అటువంటి ఉపాధి హామీ చట్టాన్ని ఉపసంహరించడం మూలంగా గ్రామీణ ప్రాంతంలో నిరుద్యోగం ప్రబలి, వేతనాలు దిగజారి, గ్రామీణ ప్రాంత ఆదాయాలు పడిపోతాయి. గ్రామీణ ప్రాంత నయాధనిక వర్గానికి కూలీల మార్కెట్ మీద పట్టు పెరిగి, మరింత దోపిడి సాగించే అవకాశాలు పెరుగుతాయి. ఉపాధి హామీ అమలులోకి వచ్చాక పనికి చెల్లించే వేతనాల కన్నా శ్రామికుల మార్కెట్‌కి గిరాకీ పెరగడం మూలంగా పరోక్షంగా గ్రామీణ ప్రాంత పేదల ఆదాయాలు పెరిగాయని వివిధ అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే గత కొన్నేళ్లుగా మోడీ ప్రభుత్వం ఉపాధి హామీకి నిధుల కేటాయింపుల్లో కోతవిధిస్తూ దానిని నీరుగార్చే ప్రయత్నాలు కొనసాగిస్తూ వచ్చింది. చివరికి పార్లమెంట్‌లో ఎలాంటి చర్చ లేకుండానే రద్దు చేసింది. గత కొన్నేళ్లుగా ఉపాధి హామీ అమలులో నిధుల దుర్వినియోగం జరుగుతూ ఉందని ఒక పథకం ప్రకారం నిధుల దుర్వినియోగం జరుగుతూ ఉందని ప్రచారం సాగించడం ద్వారా ప్రజానీకంలో ఈ పథకం అంతా అవినీతిమయం అనే అభిప్రాయం పాదుకొల్పడానికి గట్టి ప్రయత్నమే చేశారు. అయితే దీని అమలులో దుర్వినియోగాన్ని నివారించేందుకు అనేక రాష్ట్ర ప్రభుత్వాలు హాజరు, చెల్లింపులను డిజిటలైజ్ చేశాయి. వాస్తవానికి నిధుల దుర్వినియోగం అనేది దీని కేటాయింపులతో పోలిస్తే అతి కనిష్ఠంగా ఉన్నాయి. దీనికి కూడా అవకాశం లేకుండా మరింత పారదర్శకంగా అమలు చేయడానికి తగిన చర్యలు చేపట్టాల్సిందిపోయి మోడీ ప్రభుత్వం ఏకంగా ఉపసంహరించింది. ప్రభుత్వం చేపట్టిన అనేక భారీ ప్రాజెక్టుల్లో ఉపాధి హామీ అమలులో జరిగిందని చెప్పుకొస్తున్న దుర్వినియోగానికి మించిన స్థాయిలో ఎన్నో రెట్లు అవినీతి, లంచాల చెల్లింపులు జరిగాయని ఇప్పటి వరకూ అనేక వార్తలు వెలువడ్డాయి. అలాంటప్పుడు ఉపాధి హామీని రద్దు చేసినట్లు ఈ ప్రాజెక్టులను రద్దు చెయ్యాలి కదా..! కానీ అలా జరగలేదు, జరగదు కూడా. ఎందుకంటే ఈ భారీ ప్రాజెక్టులలో జరిగే భారీ అవినీతి భాగోతాల్లో పాలకశక్తుల, సంపన్న వర్గాల పరస్పర ప్రయోజనాలు ఇమిడి ఉంటాయి. అదే పేదల విషయానికి వస్తే, అందులోనూ ఒక హక్కుగా ఉపాధి, దానికి తగ్గ వేతనం పొందడం విషయానికి వస్తే ఏ కొద్ది పాటి దుర్వినియోగం అయినా ఏకంగా దాని రద్దుకే దారి తీస్తుంది. ఇక్కడ నిధుల దుర్వినియోగం కన్నా దీని మూలంగా శ్రమ దోపిడీ ఇష్టారాజ్యంగా సాగించుకోవడానికి అవకాశం లేకుండా పోవడమే కులీన శక్తులకు కంటగింపుగా మారింది.

**-బహుముఖ దాడి**

ఉపాధి హామీ ఉపసంహరణ మూలంగా గ్రామీణ పేదలు బహుముఖ దాడికి గురవుతారు. ఒక హక్కుగా ఉపాధిపొందే అవకాశం కోల్పోతారు. తక్కువ కూలికి పనిలో కుదురుకోవాల్సి వస్తుంది. ఉపాధి పొందడంలో కులవివక్షకు, లింగ వివక్షకు లోనవుతారు. ఒక్క మాటలో చెప్పాలంటే గ్రామీణ భూస్వాములు, నయా ధనిక వర్గాల చెప్పుచేతల్లో నలిగి పోవాల్సి వస్తుంది. ఫ్యూడల్ రాజకీయ, ఆర్థిక ఆధిపత్యానికి తలొగ్గాల్సివస్తుంది. మోడీ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన 'విబి జి రామ్‌జి' పథకం మూలంగా రాష్ట్ర ప్రభుత్వాల మీద విపరీతమైన ఆర్థిక భారం పడుతుంది. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల మూలంగా ఏటికేడాదికి రాష్ట్ర ప్రభుత్వాలకు అందాల్సిన నిధులు తగ్గిపోనున్నాయి. ఇలాంటి నేపధ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలు దీని అమలుకు అయ్యే ఖర్చులో 40 శాతం వాటా భరించాల్సి రావడం అంటే అంత శక్తిలేని రాష్ట్రాలన్నింటా ఈ పథకం విస్తృతి కుంచించుకుపోతుంది. ప్రపంచంలోనే అతిపెద్ద డిమాండ్ ఆధారిత ఉపాధి కల్పనా పథకం అమలు ద్వారా గ్రామీణ పేదలకు ఏటా కనీసం వందరోజులు పని కల్పించాల్సిన చట్టబద్ధమైన బాధ్యతను నిధుల లభ్యత సాకుగా చూపించి అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు వదిలించుకుంటాయి. పైపెచ్చు కొత్త పథకంలో ఉపాధి హామీ పనులను కేంద్ర ప్రభుత్వం గుర్తించి 'నోటిఫై' చేసిన ప్రాంతాలలో మాత్రమే అమలు చెయ్యాలని పొందుపరిచిన నిబంధన మూలంగా ఈ సంక్షేమ పథకాన్ని కేంద్రంలో ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉంటే అది దాని రాజకీయ ప్రయోజనాలకు అనుగుణమైన సాధనంగా వాడుకుంటుంది.

# లక్ష్యం ఉన్నతంగా పెట్టుకుని కష్టపడాలి: సీఎం రేవంత్ రెడ్డి

-చిట్టబోయినపల్లిలో ఐఐఐటీకి భూమిపూజ
-విద్యారంగానికే ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యం
-ఏడాదిలో భవన నిర్మాణం పూర్తి చేస్తామని హామీ



మహబూబ్‌నగర్, జనవరి 17 పల్లె వెలుగు,
లక్ష్యం ఎప్పుడూ ఉన్నతంగా ఉండాలని, దాన్ని సాధించేందుకు కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థినీ విద్యార్థులకు సూచించారు. భాషా నైపుణ్యం, జ్ఞానం పెంపొందించుకోవడానికి చిత్తశుద్ధితో పనిచేయాలని, నిబద్ధతతో కూడిన విద్యే సమాజంలో ఉన్నతంగా నిలబెడుతుందని ఆయన ఉద్బోధించారు.మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం చిట్టబోయినపల్లిలో రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయానికి భూమిపూజ చేసిన అనంతరం ముఖ్యమంత్రి విద్యార్థులతో ముఖాముఖి సంభాషించారు. ఈ సందర్భంగా విద్యకు ఉన్న ప్రాధాన్యతను వివరించడంతో పాటు, విద్యార్థులు ప్రస్తావించిన అంశాలకు స్పందించారు. ఉజ్వలమైన భవిష్యత్తు కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులందరికీ శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. విద్యారంగ అభివృద్ధినే ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, మహబూబ్‌నగర్ జిల్లాలో ఐఐఐటీతో పాటు ఇంజినీరింగ్, న్యాయ, వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సివిల్ సర్వీసెస్ పరీక్షలకు హాజరయ్యే యువతకు ప్రధాన పరీక్షలు, ఇంటర్వ్యూల దశల్లో ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు. విద్యే జీవితాన్ని మార్చగల శక్తి అని, అభివృద్ధి చెందిన పౌరులుగా నిలదొక్కుకోవడానికి చదువు కీలకమని స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పనిచేశారని గుర్తు చేసిన సీఎం, 75 ఏళ్ల తర్వాత జిల్లాకు మళ్లీ ఆ అవకాశం దక్కిందన్నారు. ఈ రోజు భూమిపూజ చేసిన ఐఐఐటీ భవన నిర్మాణాన్ని ఏడాది కాలంలో పూర్తి చేస్తామని ప్రకటించారు. రూ.200 కోట్లతో నిర్మించే ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర్ రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీలు మల్లు రవి, అరుణ తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No 9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com